**నేటి కందం-నేటికి అందం**

పచ్చని బ్రతుకుల యందున
హెచ్చుయివీ సోకకుండ హేజిబు పొన్నం
మెచ్చెడి ర్యాలీ తీయగ
తచ్చాడెడి హైన్య రుగ్మతలు తొలగు ధృతిన్ !!

(హెచ్చుయివీ కి వ్యతిరేకంగా మంత్రి పొన్నం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ లో ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన కల్పించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**చురక**

ప్రాజెక్టుల నీళ్లన్నీ
ప్రభుత్వం ఎత్తిపోత
చివరికైనా గుర్తించెను
సాగునీటి తలపోత.
ఇదే ముందు చేసేస్తే
ఇంత రబస జరిగేదా
ప్రజల్లోన అసంతృప్తి
ప్రబలంగా పెరిగేదా

-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ శుక్రవారం 14-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:9 పేజీలు:6 వెల: రూ.1/-


## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు..

**-పైలాన్, నూతన కలెక్టరేట్ భవన సముదాయాల పరిశీలన**
**-రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**



ములుగు, ఆగష్టు 13:(నేటినిజం ప్రతినిధి)ములుగు జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ లతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కి ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ? ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పైలాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్‌తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

**ఈ నెల 16న ములుగు కు సీఎం : మంత్రి సీతక్క.**

ఈ నెల 16న ముఖ్యమంత్రి ఎనిముల రేవంత్ రెడ్డి ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారని మంత్రి సీతక్క మీడియా సమావేశంలో వెల్లడించారు. మధ్యాహ్నీ సమయంలో మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క?సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం వనదేవతల సన్నిధి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు సంతృప్త స్థాయిలో పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఆగష్టు 3 వరకు దరఖాస్తు చేసుకున్న వారిని గతంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రం నకు చేరుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల పనులకు సంబంధించిన అభివృద్ధి పనుల పైలాన్‌ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో పెద్ద ఎత్తున రహదారి పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్‌కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు.

అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసే సభలో ప్రజలు, అభిమానులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ములుగు నియోజకవర్గ, జిల్లా ప్రజలు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి ఆహ్వానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీ చందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగులో దారుణం.. భార్యతో అక్రమ సంబంధం

ములుగు, ఆగష్టు 13: జిల్లాలోని మంగపేట మండలం కమలాపూర్ గ్రామంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. వివాహేతర సంబంధం ఓ వ్యక్తి ప్రాణాలను బలితీసుకుంది. భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఓ వ్యక్తిని భర్త అతికిరాతకంగా హత్య చేశాడు. గ్రామంలో నర్సింహరావు అనే వ్యక్తి భార్యతో కలిసి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. వీరితో పాటు శేషు అనే వ్యక్తి కూడా అదే గుడిసెలో ఉంటున్నాడు. వీరంతా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

అయితే నర్సింహరావు భార్యతో శేషు అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. కొంతకాలంగా వీరిద్దరూ కలిసి నర్సింహరావును మోసం చేస్తూ వారి సంబంధాన్ని కొనసాగించారు. చివరకు వీరిద్దరి మధ్య ఉన్న సంబంధం గురించి తెలుసుకున్న నరసింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శేషును గొడ్డలితో నరికి చంపేశాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రైవేట్ బస్సును ఢీకొన్న కంటైనర్ లారీ.. ఇద్దరు మహిళల మృతి

నిజామాబాద్, ఆగష్టు 13: జిల్లాలోని ఆర్మూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోవింద్‌పేట్ ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును కంటైనర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ప్రైవేటు బస్సు టైర్ పంక్చర్ అవడంతో బస్సును డ్రైవర్ రోడ్డుపై నిలిపాడు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలు బస్సు ఎదుట ఉన్న డివైడర్‌పై కూర్చుకున్నారు. ఇదే సమయంలో అతివేగంతో దూసుకొచ్చిన కంటైనర్ లారీ.. వెనుక నుంచి బస్సును ఢీకొట్టింది. ఈ క్రమంలో బస్సు ముందు డివైడర్‌పై కూర్చున్న మహిళలపైకి బస్సు టైర్ ఎక్కడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మహిళల మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఝార్ఖండ్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు.. 600 మందిపై కేసు

న్యూ ఢిల్లీ, ఆగష్టు 13: ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసన కార్యక్రమానికి సంబంధించి పోలీసులు తాజాగా 600 మందిపై కేసు నమోదు చేశారు. కేసు ఎదుర్కొంటున్న వారిలో 500 మంది గుర్తు తెలియని విద్యార్థులు కూడా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో పేపర్ లీక్స్ ఉదంతాలకు నిరసనగా విద్యార్థులు నిరసనలు చేపడుతున్న విషయం తెలిసిందే. నిరసన కార్యక్రమాలు ప్రస్తుతం 20వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఉద్రిక్తత పరిస్థితులు కనిపించాయి. విద్యార్థులను అదుపు చేసేందుకు పోలీసులు బ్యాటన్ చార్జ్ చేశారు. వాటర్ క్యానన్, భాష్పవాయువును ప్రయోగించారు. పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా మరుసటి రోజు బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది.

పరీక్ష నిర్వహణ విషయంలో ప్రభుత్వం తమ డిమాండ్స్‌కు తలొగ్గే వరకూ నిరసనలు విరమించేది లేదని విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు. జేపీఎస్‌సీ-జేఎస్ఎస్‌సీ మంచ్ ఆధ్వర్యంలో రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద నిరసనలు కొనసాగుతున్నాయి. పరీక్ష నిర్వహణలో మరింత పారదర్శకత తీసుకురావాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. పేపర్ లీక్ ఆరోపణలు ఉన్న పలు పరీక్షలను రద్దు చేయాలని కోరుతున్నారు. సీబీఐ లేదా ఇతర రాష్ట్రాల మాజీ జడ్జిలతో స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.

ఇదిలా ఉంటే, విద్యార్థుల డిమాండ్స్‌ను ప్రభుత్వం మరో వారంలోపు నెరవేర్చకపోతే తాను నిరాహార దీక్షకు దిగుతానని మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ బుధవారం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా 1200 యూనివర్సిటీల్లో తామూ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్టు ఏబీవీపీ కూడా తెలిపింది.

## జగన్ హయాంలో అదనపు నీటిని ఏపీ తరలిస్తుంటే బీఆర్ఎస్ నేతలు ఎందుకు ప్రశ్నించలేదు: యెన్నెం శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 13: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అదనపు నీటిని ఏపీ తరలిస్తుంటే బీఆర్ఎస్ నేతలు అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని తెలంగాణ ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి (జవనినిజీఎ వాతీతినితిలజీబ ఖీవటటఎ) ప్రశ్నించారు. స్వలాభం కోసం, ఎంపీ సీట్ల కోసం తెలంగాణ నీటిని, ప్రజలను ఏపీకి కేసీఆర్ తాకట్టు పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వతంగా తెలంగాణకు కేసీఆర్ నష్టం చేశారని ఆగ్రహించారు. ఈరోజు (గురువారం) సీఎల్పీ మీడియా పాయింట్‌లో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ఢిల్లీలో గద్దె ఎక్కడానికి చేసిన ప్రయత్నాలు అన్ని ఇన్ని కావని ప్రస్తావించారు. కేసీఆర్ రాయలసీమను రతనాల సీమ చేస్తాననే విషయాన్ని బీఆర్ఎస్ నేత జగదీశ్వర్ రెడ్డి మర్చిపోయినట్లుగా ఉన్నారని విమర్శించారు.

వారు రోజుకో కొత్త డ్రామాకు తెరదీస్తున్నారు..

జగదీశ్వర్ రెడ్డి రాజకీయాల కోసం రైతులను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని శ్రీనివాస్ రెడ్డి దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని కుట్రలు చేసిన, ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్వర్ రెడ్డి రోజుకో కొత్త డ్రామాకు తెరదీస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఏపీకి అదనంగా తరలించుకొని పోయిన నీటి గురించి వైసీపీ నేతలే ప్రెస్‌మీట్లు పెట్టి మరి చెబుతున్నారని అన్నారు. గతంలో జగన్ రెడ్డి సీఎం హోదాలో అసెంబ్లీ వేదికగా శ్రీశైలం నుంచి తీసుకెళ్తున్న నీటిని ప్రస్తావించలేదా..? అని నిలదీశారు. కేసీఆర్ సహకారంతో ప్రాజెక్టులను పెంచుతున్నట్లు జగన్ అసెంబ్లీలో చెప్పారని అన్నారు.

కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..

జగన్ అసెంబ్లీలో మాట్లాడినప్పుడు జగదీశ్ రెడ్డి ఎక్కడ ఉన్నారు? అని శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. ఎల్‌నినో ఎఫెక్ట్ ఉన్నా దేవుడి దయ వల్ల వర్షాలు పడుతున్నాయని చెప్పుకొచ్చారు. మళ్లీ బీఆర్ఎస్ నేతలు కొత్త డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. కృష్ణాలో 500 టీఎంసీల నీటి కోసం కాంగ్రెస్ కొట్లాడుతోందని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బేసిన్‌లు లేవు, బేషజాలు లేవని చెప్పింది నిజం కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు చేసే విమర్శలకు తాము అసెంబ్లీలో చర్చిస్తామని.. కేసీఆర్ సభకు రావాలని యెన్నెం శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు.

## మేడారం చివరిదశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

**-స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక అభివృద్ధి.**
**-: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క.**

ములుగు, ఆగష్టు 13:(నేటినిజం ప్రతినిధి)మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ చివరిదశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు.

మహిళలు స్వయం ఉపాధితోనే ఆర్థిక అభివృద్ధి సాధించాలని మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం ఆలయ పరిసర ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం పరిశీలించారు. అనంతరం వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క భవన్‌లో మదర్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆలయ పరిసరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయని, నిర్మాణ పనులను వేగంగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కుట్టు శిక్షణతో పాటు కుట్టుమిషన్ల పంపిణీ మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

మహిళల స్వావలంబన, సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్‌రెడ్డి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ప్రత్యేక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'క్రీడా ప్రాంగణం కూల్చివేత ఆక్షేపనీయం'

**- స్థానికుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకోవాలి**
**-స్థల పరిశీలనలో బీఆర్ఎస్, సిపిఎం నేతలు**



ఖమ్మం రూరల్, ఆగష్టు 13 : విద్యార్థులు, యువత భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం కూల్చివేయడం ఆక్షేపనీయమని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు నందిగామ కృష్ణ, ఎటుకూరి ప్రసాద్, స్థానిక ప్రజలతో కలిసి గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. ఇటీవల అధికారులు కూల్చి వేసిన క్రీడా మైదానంను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తొలుత స్థానికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో ఈ క్రీడా ప్రాంగణంలోని ఆటలాడుకోవడం జరుగుతుందన్నారు. పిల్లలకు ఉపయోగపడే క్రీడా ప్రాంగణాన్ని తిరిగి ఉపయోగాల్లోకి తీసుకురావాలని వారి కోరారు.

బెల్లం వేణుగోపాల్ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్‌ను, యువకులలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకుగాను ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని కూల్చివేయడం సమంజసం కాదన్నారు. దీంతో ప్రభుత్వ నిధులు వృథా కావడంతో పాటు స్థానికులకు ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. స్థానికుల ఆలోచన మేరకు తిరిగి క్రీడా ప్రాంగణం పునఃనిర్మాణం చేయాలని, లేదా ఇప్పటికే శంకుస్థాపన చేసినటువంటి పార్కు ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలైన కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై త్వరలోనే అఖిలపక్ష నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ఇందిరమ్మ కాలనీ యువకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## మీరు చేయలేకపోతే మేమే చేస్తాం.. లేబుల్స్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు హెచ్చరిక..

న్యూఢిల్లీ, ఆగష్టు 13:అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది

జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది.

ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.

ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు ఆహార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది




# ఆర్థిక అక్షరాస్యతను పాఠ్యాంశంగా చేర్చలేమా !

## (14 ఆగష్టు "జాతీయ ఆర్థిక అవగాహన దినోత్సవం" సందర్భంగా)

ధనం మూలం ఇదం జగత్ – ప్రపంచం ధనంతోనే నడుస్తుంది. డబ్బు ఎవరికీ చేదు కాదు. ధనమేరా అన్నిటికీ మూలం. ధనం విలువ తెలుసుకొనుట మానవ ధర్మం. డిజిటల్ యుగంలో ఆర్థిక వనరులే అన్నింటినీ శాసిస్తున్నాయి. నేటి మానవ బంధాలన్నీ వాణిజ్య బంధాలుగా మారాయి. డబ్బు సంపాదించడం ఒక ఎత్తు, సంపాదించిన డబ్బును వినియోగించడం మరో ఎత్తు. ఎంత సంపాదించామన్నదాని కన్న ఎంత ఆదా చేస్తున్నామన్నది ముఖ్యమని మన జీవిత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన కుటుంబాలు బజారున పడడం చూస్తున్నాం. ఆదాయాన్ని క్రమ ప్రణాళికతో ఖర్చు చేయడం వల్ల ఆ వ్యక్తితో పాటు కుటుంబం కూడా సుఖ సంతోషాలతో, ధైర్యంగా జీవనయానం కొనసాగిస్తారు. అనాలోచితంగా, విచ్చలవిడిగా ఖర్చు చేసిన వారు ఎంత సంపాదించినా ప్రయోజనం శూన్యమే.

### జాతీయ ఆర్థిక అవగాహన దినోత్సవం :

నేటి ఆదాయం రేపటికి పునాది కావాలి. ఆర్థిక క్రమశిక్షణ చిన్నతనం నుంచే అలవాటు కావాలి. ఉన్నత విద్యావంతుల్లో కూడా ఆర్థిక నిరక్షరాస్యత కనిపిస్తున్నది. ఆర్థిక అవగాహన లేమితో కుటుంబాలు అశాంతి నెలవులుగా మారుతున్నాయి. నేటి పిల్లలు, యువతలో ఆర్థిక నిరక్షరాస్యత రాజ్యమేలుతున్నది. ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఆదాయంలో ఎంత పొదుపు చేశామన్నదే ప్రధానమని మరిచిన ఏఐ ప్రపంచంలో మనం ఉన్నాం. నేటి పిల్లల నుంచి కురువృద్ధుల వరకు అందరికీ ఆర్థిక అక్షరాస్యత కల్పించటానికి ప్రతి ఏట 14 ఆగష్టున "జాతీయ ఆర్థిక అవగాహన దినోత్సవం" లేదా "నేషనల్ ఫైనాన్సియల్ అవేర్నెస్ డే" పాటించడం జరుగుతోంది. మన విద్యా వ్యవస్థలో కూడా ఆర్థిక అక్షరాస్యతను బోధించడం లేదు. చిన్న పిల్లలకు పాకెట్ మనీ ఇచ్చినపుడు వారు 'గల్ల గురిగి'లో వేసి దాచుకోవడం మనకు తెలుసు. అదే అలవాటు క్రమంగా ఆర్థిక క్రమశిక్షణకు పునాదిగా మారుతుంది. చిన్నతనంలోనే విచ్చలవిడిగా ఖర్చు చేయడం అలవాటు అయితే రేపటి వారి భవిత అంధకారంలోకి జారి పోవడం ఖాయమని తెలుసుకోవాలి. పిల్లాడి స్థాయిలో అలవాటు అయిన ఆర్థిక క్రమశిక్షణ రేపటి కుటుంబ శాంతికి పునాదిగా మారుతుంది.

### విచక్షణారహిత ఖర్చుతో ఆర్థిక చిక్కులు:

జాతీయ ఆర్థిక అవగాహన దినోత్సవం వేదికగా వేతనం పొందడం, పొదుపు చేయడం, ఆర్థిక ప్రణాళికలు వేయడం, కనీస ఖర్చులు చేయడం, తప్పని పరిస్థితుల్లో అప్పు చేయడం, ఆస్తులను పెట్టుకోవడం లేదా కాపాడుకోవడం లాంటి అంశాలను అవగాహన కలిగించాలి. మన నెలసరి ఆదాయంలో కొంత కుటుంబ ఖర్చులకు, కొంత పిల్లల చదువులకు, కొంత అత్యవసర సామాజిక ఖర్చులకు వెచ్చించిన పిదప తప్పనిసరిగా కొంత డబ్బును పొదుపు లేదా ఆదా చేయడం అలవాటుగా మారాలి. నేడు పొదుపు చేసిన ధనం రేపటి ఊహించని అత్యవసర సమయాల్లో మనల్ని ఆదుకుంటుంది. పొదుపు చేసిన డబ్బును సరైన పద్దతిలో పెట్టుబడి పెడుతూ, మన ఆస్తిని పెంచుకోవచ్చు. ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యాలు ఉన్నట్లే, మన ఆదాయాన్ని సరైన పద్దతిలో ఖర్చు చేసే ఆర్థిక నైపుణ్యాలను కూడా నేర్చుకోవాలి. చిరిగిన బట్టలు వేసుకోవడం, తెగిన చెప్పును తిరిగి తిరిగి వాడడం, సనీస అవసరాలకు ఖర్చు చేయకపోవడం, తింటే ఖర్చు అవుతుందని కాలే కడుపుతో పడుకోవడం లాంటివని పిసినారి గుణాలుగా భావిస్తాం. విలాసాలను కూడా కనీస అవసరాలు అనుకుంటూ, గోరుతో పోయే దానిని గొడ్డలి దాకా తెచ్చుకున్నట్లు, తక్కువ ఖర్చుతో జరిగే పనికి అనేక రెట్లు అధికంగా ధనాన్ని నీటి వలె ఖర్చు చేయడం వల్ల భవిష్యత్తు చిక్కుల్లో పడుతుంది, రుణ విష వలయంలోకి నెట్టి వేస్తుంది.

### దీపం ఉండగానే ఇళ్లు చిక్కబెట్టుకుందాం:

డబ్బు ఉన్నపుడు ఎగిరి పడడం, లేనప్పుడు కుంగి పోవడం ధీరత్వం కాదు. అప్పులు చేయడం, ఆర్థిక చిక్కులతో ఆత్మహత్య చేసుకోవడం వీరత్వం కాదు. ప్రాధాన్యాలను మరిచి విచక్షణారహితంగా ఖర్చు చేయవద్దు. కనీస అవసరాలకు, విలాసాలకు మధ్య వ్యత్యాసం తెలుసుకోవాలి. మన పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి కంప్యూటర్ లిటరసీ నేర్పిలట్లే, ఆ చిన్నారులకు ఫైనాన్సియల్ లిటరసీ కూడా నేర్పాలి. ఆకర్షణీయ వేతనం అందించిన విద్యకు సరి సమానంగా ఆదాయాన్ని ఖర్చు చేసే ఆర్థిక అక్షరాస్యత కూడా అవసరమని తెలుసుకోవాలి. చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకున్నట్లు, ఆదాయ పరిమితులను గమనించి ఖర్చులను కుదించుకోవాలి. అనారోగ్యాలు, ప్రమాదాలు చెప్పి రావు కాబట్టి రేపటి అత్యవసరాలను నేటి పొదుపు ఆదుకునే విధంగా ప్రణాళికలు వేసుకోవాలి. దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్క బెట్టుకున్నట్లు, డబ్బు ఉన్నపుడే ఆదా చేయడం నేర్చుకోవాలి.

### పొదుపు ప్రయోజనాలు:

మన నెలసరి ఆదాయంలో కొంత మొత్తం పొదుపు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకోవాలి. ఆదా చేసిన వ్యక్తుల్లో ధైర్యం, మనో శాంతి, భయం తొలగడం, ప్రతికూల సమయాలను ఎదుర్కోగలగడమనే ధీమా, కుటుంబ సభ్యుల భద్రత, ఆనంద ఆరోగ్యకర వాతావరణం, పిల్లలకు ఆర్థిక క్రమశిక్షణ అలవడడం, ఆస్తులను పెంచకపోవడం, పిల్లలకు ఉన్నత చదువులను అందించగలగడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ప్రేమ పేరుతో గాని లేదా ఫాల్స్ ప్రిస్టేజ్ కోసం అంటూ పిల్లలు లేదా యువత అడిగినంతనే అధిక మొత్తంలో డబ్బును అందించడం వల్ల ఆ చిన్నారులకు లేదా యువతకు విచ్చలవిడిగా ఖర్చు చేయడం దురలవాటుగా మారుతుంది. నేడు చేసిన పొదుపు రేపటికి భరోసాను అందిస్తుంది. కుటుంబ అవసరాలు, పిల్లల విద్యకు తగిన ఖర్చులకు వెనకాడకుండా కొంత సొమ్మును విధిగా పొదుపు చేయాలి. ఉద్యోగంలో చేరిన రోజే పదవి విరమణ తేదీ ఖరారు అవుతుంది కాబట్టి తొలి నాళ్ల నుంచే పొదుపు మార్గం ఎంచుకోవాలి.

### ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి:

ఆర్థిక క్రమశిక్షణతో వృత్తిలో ఎదుగుదల, సాఫీగా వైవాహిక జీవితం కొనసాగడం, స్వంత ఇల్లు కల సాకారం కావడం, పిల్లలకు ఉన్నత విద్య అందించడం, ఊహించని ఖర్చులను తట్టుకోవడం, వాహనాలను కలిగి ఉండడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. 'తెలియక పోవడం తప్పు కాదు, తెలిసి పొదుపు చేయకపోవడం తప్పు' అని గమనించాలి.

ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన కుటుంబాల్లో గొడవలు, అప్పుల బాధలు, అశాంతి, భవిష్యత్తు పట్ల అనిశ్చితి, మానసిక ఒత్తిడితో అనారోగ్యాలు,:కుటుంబ పోషణలో ఇబ్బందులు, పిల్లల పెంపకంలో అవాంతరాలు లాంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురవుతాయి. మన పిల్లలకు విద్యతో పాటు మంచి అలవాట్లు, మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసం, కనీస కంప్యూటర్ పరిజ్ఞానం, ఆర్థిక అక్షరాస్యత లాంటి అంశాలను తప్పనిసరిగా నేర్పించడా నేటి తల్లితండ్రులతో పాటు ఉపాధ్యాయుల బాధ్యత అని మరువరాదు.

నాడు నగదుతో మాత్రమే జరిగిన క్రయవిక్రయాలు నేటి యువత చేతుల్లో క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ-వాణిజ్యాలు లాంటి సౌకర్యాలు కొన్ని సందర్భాల్లో ప్రమాదకర పరిస్థితులకు దారి తీయడం చూస్తున్నాం.

నేటి యువత ఆర్థిక అక్షరాస్యత ప్రాధాన్యాన్ని తెలుసుకొని, పొదుపుకు ప్రాధాన్యమిస్తూ, ఖర్చులకు పరిమితులను ఏర్పరచుకొని ముందుకు సాగితే వారి భవిష్యత్తు సాఫీగా, ఆనందంగా కొనసాగుతుంది.



-మధుపాళీ
9949700037

# దేశవాళీ వరి రకం కాలానమక్ సాగు

న్యూఢిల్లీ, ఆగష్టు 13: ఇటీవల కాలంలో దేశవాళీ వరి రకం కాలానమక్ సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పెరగటంతో రైతుల ఆదాయం పెరిగింది. ఉత్తరప్రదేశ్ లోని సిద్ధార్థనగర్ జిల్లాలో ఈ రకం వరి ఉత్పత్తి 2018 నుంచి 2025 మధ్య అయిదు రెట్లకుపైగా పెరిగింది. కాలానమక్ బియ్యం విక్రయ ధరల్లోనూ మార్పులు వచ్చాయి. 2018లో కిలో రూ.40 ఉండగా.. 2026 నాటికి కిలో బియ్యం ధర రూ.150కి పెరిగింది. కాలానమక్ వరిని సాగు చేసే రైతుల సంఖ్య 2018లో 2,915 నుంచి 2024 నాటికి 23,000కు చేరుకుంది.

కాలానమక్ వరి సాగు చేసే రైతులకు ఆర్థికంగా, సాంకేతికత పరంగా, మార్కెటింగ్ పరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతిచ్చాయి. పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ), ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఓడీఓపీ), మార్జిన్ మనీ పథకం (రాష్ట్ర నిధులతో కూడిన) ద్వారా కాలానమక్ ప్రాసెసింగ్, మిల్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేసే ప్రత్యేక సూక్ష్మ విభాగాలు, ఎఫ్‌పీఓలకు 35 శాతం వరకు (గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు) క్రెడిట్ ఆధారిత మూలధన సబ్సిడీ లభిస్తుంది. కాలానమక్ మహోత్సవాల నిర్వహణ ద్వారా దేశవాళీ వరి వంగడాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఒక జిల్లా ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) పథకం ద్వారా సిద్ధార్థనగర్‌లో కాలానమక్ బియ్యం కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేశారు. దీనివల్ల ఆధునిక ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, ఎగుమతి సౌకర్యాలు రైతులకు అందుబాటులోకి వస్తాయి. కాలానమక్ వరి సాగు, ఉత్పత్తి, ప్రాసెసింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించింది.

కాలానమక్ వరి వంగడాల అభివృద్ధి, పెద్ద ఎత్తున స్థానిక రకాల పరిరక్షణకు ఐసీఏఆర్ ఆధ్వర్యంలోని జాతీయ వ్యవసాయ పరిశోధనా వ్యవస్థ పనిచేస్తోంది. సంప్రదాయ దేశవాళీ వరి వంగడాలతో పాటు కాలానమక్ కెఎన్3, బౌనా కాలానమక్ 101, బౌనా కాలానమక్ 102, కాలానమక్ కిరణ్, పూసా నరేంద్ర కాలానమక్ 1, పూసా సీఆర్‌డీ కాలానమక్ 2 అనే ఆరు మెరుగైన రకాలను విడుదల చేశారు. వీటిలో చివరి రెండు పొట్టి రకాలు అధిక దిగుబడినిచ్చే దేశవాళీ రకాలు. సంప్రదాయ రకాలు హెక్టారుకు 2.5 టన్నుల దిగుబడి ఇస్తే.. ఈ పొట్టి రకాలు హెక్టారుకు 4.5 టన్నుల దిగుబడినిస్తాయి. నూతన, అధిక దిగుబడినిచ్చే, వాతావరణాన్ని తట్టుకునే కాలానమక్ రకాలను విడుదల చేసేందుకు వివిధ ప్రాంతాల్లో పరీక్షించే విధానాలను భౌగోళిక సూచిక (జీఐ) పరిధిలోని కేవీకేల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సంప్రదాయ కాలానమక్ వరి వంగడాల రిజిస్ట్రేషన్, సంరక్షణలో ఐసీఏఆర్ సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు సహకరిస్తున్నాయి. పంట రకాలు, రైతు హక్కుల ప్రాధికార సంస్థ ద్వారా ఇప్పటివరకు 1700లకు పైగా స్థానిక వరి వంగడాల రిజిస్ట్రేషన్ జరిగింది.

కాలానమక్ వరి సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు బ్రీడర్ సీడ్ కార్యక్రమం ద్వారా అదనపు విత్తన డిమాండ్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఫౌండేషన్, ధ్రువీకరించిన విత్తనాల ఉత్పత్తికి ఏటా సుమారు 15-20 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాల ఉత్పత్తి జరుగుతోంది. గత అయిదేళ్లలో (2021-22 నుంచి 2025-26) కాలానమక్ వరి వంగడాలకు సంబంధించి మొత్తం 389.6 క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసి, రైతులకు పంపిణీ చేశారు.

కాలానమక్ బియ్యం ఎగుమతులను ప్రోత్సహించేందుకు, అంతర్జాతీయ మార్కెట్లలో వాటికి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ (ఏపీఈడీఏ) ద్వారా ప్రాంతీయ రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్‌పీఓలు) నేరుగా అంతర్జాతీయ కొనుగోలుదారులతో అనుసంధానిస్తుంది. దీనిద్వారా సింగపూర్, నేపాల్ వంటి దేశాలకు ఎగుమతులు సులభమయ్యేలా మద్దతినిస్తుంది.

కాలానమక్ వరి రకాన్ని "బుద్ధ రైస్"గా బ్రాండింగ్ చేయటం ద్వారా జపాన్, థాయిలాండ్, వియత్నాం, సింగపూర్, మయన్మార్ వంటి బౌద్ధ దేశాల్లోని అధిక విలువ గల మార్కెట్లే లక్ష్యంగా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రత్యేకమైన బియ్యం కోసం సిద్ధార్థనగర్, దాని పరిసరాల్లోని తెరాయ్ జిల్లాలను ఏపీఈడీఏ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి వ్యవస్థలో చేర్చారు. ఎగుమతి ప్యాకేజింగ్, రెసిడ్యూ పరీక్ష, క్వారంటైన్ నిబంధనలకు ప్రాధాన్యత క్రమంలో ఆర్థిక సహాయం అందించటం సులభమవుతుంది.

ఈ సమాచారాన్ని వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖ సహాయమంత్రి శ్రీ భగీరథ్ చౌదరి లోక్‌సభలో ఇవాళ లిఖితపూర్వకంగా అందించారు.

# హరియాలీ అమావాస్య సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలి: కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, ఆగష్టు 13:హరియాలీ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆగస్టు 12, బుధవారం న్యూఢిల్లీలోని తల్కటోరా స్టేడియం సమీపంలోని పీబీజీ గ్రౌండ్, సెంట్రల్ రేంజ్‌లో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ వందలాది మంది సహచరులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతారు. అదే సమయంలో, శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వృక్ష మిత్ర అభియాన్ తో అనుబంధం ఉన్న వేలాది మంది సభ్యులు తమ తమ గ్రామాలు, నగరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా 50,000 పైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. మొక్కలు నాటే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా ప్రజలు హరియాలీ అమావాస్యను జరుపుకునేలా ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణ, సంరక్షణ ప్రాధాన్యతను మరింతగా చాటిచెప్పడం ఈ కార్యక్రమం లక్ష్యం.

కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, ఆగస్టు 12న పవిత్రమైన హరియాలీ అమావాస్య పర్వదినాన్ని జరుపుకుంటామని తెలిపారు. దేశంలోని ప్రతి పండుగ వెనుక శాస్త్రీయ దృక్పథంతో పాటు, ప్రజల జీవనాన్ని మరింత మెరుగుపరిచే సందేశం కూడా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే అవకాశాన్ని కల్పించే పర్వదినమే హరియాలీ అమావాస్య అని శ్రీ చౌహాన్ అన్నారు. పొలాల్లో విస్తరించిన పచ్చదనం, కొత్త పంట రాబోతుందన్న ఆశ మనసులో సంతోషాన్ని, ఆనందాన్ని నింపుతాయని ఆయన అన్నారు. ప్రకృతి పట్ల కృతజ్ఞతను కేవలం మాటలకే పరిమితం చేయకుండా మొక్కలు నాటడం ద్వారా ఆచరణలోనూ చూపించాలని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి ప్రాధాన్యతను గుర్తించి, దాని పరిరక్షణకు అర్థవంతమైన చర్యల ద్వారా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించేందుకు హరియాలీ అమావాస్య ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తుందని శ్రీ చౌహాన్ తెలిపారు. మొక్కలు నాటడం ద్వారా ప్రకృతి పట్ల కృతజ్ఞతను చాటుకోవడంతో పాటు, పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతా భావాన్ని పెంపొందించుకోవచ్చని ఆయన అన్నారు. ప్రజలందరూ చురుకుగా పాల్గొని, తమ పరిసరాల్లో మరింత పచ్చదనాన్ని పెంచడం ద్వారా ఈ పర్వదినాన్ని ప్రకృతి పండుగగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

మొక్కలు నాటనున్న వేలాది మంది వృక్ష మిత్ర పరివార్ సభ్యులు

శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, ఆగస్టు 12న హరియాలీ అమావాస్యను పురస్కరించుకుని తమ తమ గ్రామాలు, నగరాలు, పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలని వృక్ష మిత్ర పరివార్ సభ్యులు సంకల్పించినట్లు తెలిపారు. అదే రోజు తాను కూడా తన సహచరులతో కలిసి ఢిల్లీలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటానని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ హరియాలీ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని కనీసం ఒక మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించడం ద్వారా ఈ పవిత్ర సందర్భాన్ని చిరస్మరణీయంగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా వృక్ష మిత్ర పరివార్‌కు చెందిన వేలాది మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా వివిధ ప్రాంతాలు, సమాజాల్లో మొక్కలు నాటే కార్యక్రమం మరింత విస్తృతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు. గ్రామాలు, నగరాలు, పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టడం ద్వారా సభ్యులు తమ పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామూహిక బాధ్యత సందేశాన్ని విస్తృతంగా చాటి చెప్పనున్నారు. హరియాలీ అమావాస్య వేడుకల్లో మొక్కలు నాటడాన్ని ఒక అర్థవంతమైన భాగంగా మార్చుతూ, ప్రజలందరూ ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని శ్రీ చౌహాన్ కోరారు.

కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ఒక మొక్క నాటడం కేవలం పర్యావరణ పరిరక్షణ చర్య మాత్రమే కాదని, రాబోయే తరాలకు సురక్షితమైన, భద్రమైన, అందమైన భవిష్యత్తుకు పునాది వేయడమని అన్నారు. హరియాలీ అమావాస్య సందర్భంగా ఆగస్టు 12న దేశవ్యాప్తంగా ఉన్న వృక్ష మిత్రులు, ప్రజలందరూ ఒక్కొక్కరూ కనీసం ఒక మొక్కను తప్పనిసరిగా నాటాలని ఆయన పిలుపునిచ్చారు. అదే సమయంలో, ప్రతి ఒక్కరూ తమ మొక్కలు నాటే ప్రతిజ్ఞలో మరో ఐదుగురిని భాగస్వాములను చేయాలని కేంద్ర మంత్రి కోరారు. ఆ ఐదుగురూ మరో ఐదుగురిని చొప్పున ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు. తద్వారా ఈ మొక్కలు నాటే ఉద్యమంలో సాధ్యమైనంత ఎక్కువ మంది ప్రజలు భాగస్వాములు అవుతారని ఆయన అన్నారు. ఈ విధంగా భాగస్వామ్యాన్ని విస్తరించే క్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చవచ్చని ఆయన అన్నారు. వ్యక్తులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగు వారు, విస్తృత సమాజంలోని ఇతరులను కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం ఒక ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# గోదావరి నదిలో మృతదేహం లభ్యం

ఆదిలాబాద్, ఆగష్టు 13: బాసర గోదావరి నదిలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బాసర సీఐ దీపక్ తెలిపారు. సీఐ దీపక్ తెలిపిన వివరాల మేరకు ఉదయం గోదావరి నదిలో ట్రిబుల్ ఐటీ వాటర్ పంప్ దగ్గర ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారం మేరకు వయసు గజ ఈతగాళ్ళ సహాయంతో వ్యక్తి మృతదేహన్ని వెలికితీయగా ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, మృతుడు తెల్లని టీ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి వున్నాడని పేర్కొన్నారు.

పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతున్ని ఎవరైనా గుర్తించినట్లయితే ఈ ఫోన్ నెంబర్ 8712659540 కు లేదా బాసర పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ దీపక్ అన్నారు.

# గోదావరి పుష్కరాలకు రహదారి, బ్రిడ్జి అభివృద్ధి చేయాలి..

ఆదిలాబాద్, ఆగష్టు 13: రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని చామన్‌పల్లి ఎక్స్ రోడ్డు నుంచి మునిపల్లి గోదావరి వరకు రహదారిని అభివృద్ధి చేసి డబుల్ రోడ్డుగా నిర్మించడంతో పాటు మునిపల్లి వద్ద కొత్త బ్రిడ్జి మంజూరు చేయాలని కోరుతూ మునిపల్లి సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామస్తులు నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కుచాడి శ్రీహరిరావుకు వినతి పత్రం అందజేశారు.

గోదావరి పుష్కరాల సందర్భంగా ఈ ప్రాంతానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం చామన్‌పల్లి ఎక్స్ రోడ్డు నుంచి మునిపల్లి గోదావరి వరకు ఉన్న ప్రధాన రహదారిని అభివృద్ధి చేసి డబుల్ రోడ్డుగా నిర్మించాలని కోరారు. అలాగే మునిపల్లి వద్ద ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.రోడ్డు విస్తరణ, కొత్త బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేయించి, అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కుచాడి శ్రీహరిరావు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# పట్టు అధునాతన సాగు పద్ధతులపై శిక్షణ




ఆదిలాబాద్, ఆగష్టు 13: 'నా పట్టు.. నా అభిమానం' కార్యక్రమంలో భాగంగా కేంద్ర పట్టుపరిశ్రమ బోర్డు ఆధ్వర్యంలో చెన్నూర్ క్లస్టర్ పరిధిలోని కోటపల్లి మండలం ఎదులబంధం గ్రామంలోని పట్టు రైతులకు అధునాతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టు పురుగుల పెంపకంలో వ్యాధుల గుర్తింపు, నివారణ, నియంత్రణతో పాటు ఆహార మొక్కలకు వచ్చే వ్యాధులు, తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. కేంద్ర పట్టుపరిశ్రమ బోర్డు పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేసిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు క్షేత్రస్థాయిలో వినియోగించుకునే విధానాలపై అవగాహన కల్పించారు.

సుమారు 143 మంది పట్టు రైతులకు పట్టు పురుగుల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పురుగుల సంరక్షణ, ఉత్పత్తిని మెరుగుపరిచే విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా కేంద్ర పట్టుపరిశ్రమ బోర్డు సుమారు 200 కేంద్రాలను ఎంపిక చేసిందని, వాటిలో మంచిర్యాల జిల్లా కూడా ఒకటని అధికారులు తెలిపారు. అధునాతన సాంకేతిక పద్ధతులను అవలంబించడం ద్వారా పట్టు ఉత్పత్తిని పెంచుకోవడంతో పాటు నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పట్టుపరిశ్రమ బోర్డు అధికారులు పార్వతి రాథోడ్, శాస్త్రవేత్త కె.పీ. కిరణ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, ఆగష్టు 13:దేశ వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విద్యార్థులకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా ఉపకార వేతనాలను, ఫెలోషిప్ నిధులను సోమవారం పూసాలోని ఐసీఏఆర్-ఐఏఆర్ఐలో కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ విడుదల చేశారు. ఈ కార్యక్రమం ద్వారా 6,000 మందికి పైగా విద్యార్థులకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో రూ. 21.35 కోట్ల మొత్తాన్ని విడుదల చేశారు. ఈ నూతన కార్యక్రమం ప్రారంభంతో, ఎలాంటి ఇబ్బందులూ, జాప్యాలూ లేకుండా డీబీటీ ద్వారా ఉపకార వేతనాన్ని ప్రతి నెలా వ్యవసాయ విద్యార్థులు అందుకుంటారు. ఉపకార వేతన పంపిణీ ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించడం, సకాలంలో, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆర్థిక సాయం పొందేలా చూడటమే ఈ కార్యక్రమ లక్ష్యం.

కేవలం ఆర్థిక సాయంగా మాత్రమే కాకుండా, వ్యవసాయ విద్యను బలోపేతం చేయడానికి, మరింత ఆచరణాత్మకంగా మార్చడానికి, అవకాశాలతో అనుసంధానించడానికి ఉపకరించే సాధనంగా ఉపకార వేతనాన్ని కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ వర్ణించారు. డీబీటీ విధానం అమల్లోకి రావడంతో విద్యార్థులకు సకాలంలో సాయం అందుతోందని చెప్పారు. ఫలితంగా ఉపకార వేతనాల పంపిణీలో ఎదురయ్యే జాప్యాలు తొలగిపోతాయని అన్నారు. వ్యవసాయ విద్యలో ప్రయోగాత్మక శిక్షణ అత్యంత కీలకమని, ఎందుకంటే తరగతిలో చదువుకోవడం ద్వారా మాత్రమే రైతులు, శాస్త్రవేత్తలు లేదా వ్యవసాయ పారిశ్రామికవేత్తలను తయారు చేయలేమనీ విద్యార్థులనుద్దేశించి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. ప్రయోగాత్మక అనుభవాన్ని సాధించడానికీ, తరగతి వెలుపల వ్యవసాయానికి సంబంధించిన వాస్తవాలను అర్థం చేసుకోవడానికీ విద్యార్థులకు అవకాశాలు అవసరమని ఆయన తెలియజేశారు. విద్య, శిక్షణ వ్యవస్థను నిరంతరం బలోపేతం చేసేందుకు, మెరుగుపరిచేందుకు సూచనలనూ, ఆలోచనలనూ పంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. జ్ఞానాన్ని అందించడం మాత్రమే కాకుండా.. వ్యవసాయ రంగానికి సమర్థవంతంగా తోడ్పడేందుకు అవసరమైన ప్రయోగాత్మక నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, అవగాహనతో యువతను సన్నద్ధం చేయడం కూడా వ్యవసాయ విద్య లక్ష్యం కావాలని అన్నారు.

వ్యవసాయ రంగంలో ఆహార భద్రత, పోషణ, రైతుల ఆదాయ భద్రతకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం, మార్గదర్శకత్వంలోని ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని శ్రీ చౌహాన్ అన్నారు. ఐసీఏఆర్ (భారత వ్యవసాయ పరిశోధనా మండలి) శాస్త్రవేత్తల కృషిని ఆయన ప్రశంసించారు. వ్యవసాయ కృషికి శాస్త్రవేత్తల పరిశోధనలు తోడై దేశ వ్యవసాయ నిల్వలను బలోపేతం చేశాయని, భారత వ్యవసాయ అభివృద్ధికి గణనీయంగా తోడ్పడ్డాయని చెప్పారు. కెరీర్ నిర్మాణంతో పాటుగా దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని, అర్థవంతమైన రీతిలో దేశం కోసం ఏదైనా చేయాలని యువతను ప్రోత్సహించారు. ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా.. ఆవిష్కరణ, అంకుర సంస్థలు, పరిశోధనల్లో కూడా వ్యవసాయ విద్యార్థులు రాణించాలని శ్రీ చౌహాన్ చెప్పారు. విస్తృత అవకాశాలను అందించే రంగంగా వ్యవసాయాన్ని చూడాలని యువతరానికి పిలుపునిచ్చారు. అలాగే కొత్తగా పుట్టుకొస్తున్న సవాళ్లకు నూతన పరిష్కారాలను కనుగొనేందుకు సహకరించాలని సూచించారు. ఈ రంగంలో శాస్త్రీయ పురోగతి, ఔత్సాహిక పారిశ్రామిక రంగం, ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో యువ వ్యవసాయ నిపుణులు, విద్యార్థుల ప్రాధాన్యాన్ని స్పష్టం చేశారు.

ఉపకార వేతనాల పంపిణీని మరింత పారదర్శకంగా, వేగంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్ఎన్‌పీ-డీబీటీ వ్యవస్థ మారుస్తుందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా విద్యార్థులకు సకాలంలో ఆర్థిక సాయం అందుతుందని, దీనివల్ల ఉపకార వేతన నిధుల విడుదలలో అనిశ్చితి వల్ల ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకుండా చదువుపై దృష్టి సారిస్తారని ఆయన తెలిపారు. విద్యార్థులకు కేవలం విద్యాపరమైన జ్ఞానాన్ని మాత్రమే కాకుండా.. ఆచరణాత్మక సామర్థ్యాలపై, వ్యవసాయంలో మారుతున్న అవసరాలపై కూడా అవగాహనను పెంపొందించే విద్యావ్యవస్థను సృష్టించాల్సిన అవసరాన్ని కేంద్రమంత్రి వివరించారు.

'హరియాలి అమావాస్య' సందర్భంగా మొక్కలను నాటాలని దేశవ్యాప్తంగా ఉన్న ఐసీఏఆర్ సంస్థల్లోని వ్యవసాయ విద్యార్థులకు శ్రీ చౌహాన్ విజ్ఞప్తి చేశారు. వ్యవసాయం, పర్యావరణం పట్ల ఉమ్మడి బాధ్యతలో ఈ హరిత కార్యక్రమాలు కూడా భాగమన్నారు. మొక్కలను నాటే కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలనీ, పర్యావరణం పట్ల అవగాహనను, బాధ్యతను బలోపేతం చేయడంలో దోహదపడాలని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ భాగీరథ్ చౌధరి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్ జాట్, ఐసీఏఆర్ కార్యదర్శి శ్రీ జ్ఞానేంద్ర త్రిపాఠి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ యశ్‌పాల్ సింగ్ మాలిక్, ఐఏఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ సీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఐసీఏఆర్, ఐఏఆర్ఐకు చెందిన ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా వేలాది మంది విద్యార్థులు దీనిలో పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి..

## -రామగుండం మేయర్ మహంకాళి స్వామి
## -కార్మికులకు ఏకరూప దుస్తుల పంపిణీ

కరీంనగర్, ఆగష్టు 13:నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేని రామగుండం నగర పాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి అన్నారు. గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు మేయర్ ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా , ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు గొప్పవి అని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తమ పాలక వర్గం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం నుండి వారికి అందవల్సిన ప్రయోజనాలను సకాలంలో వచ్చేటట్లు చూస్తామని స్పష్టం చేశారు.



నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి కష్టాలు ఎదురైనా తాము అండగా నిలుస్తామని ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి కార్మికులకు భరోసా ఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల పనితీరుతోనే నగరం ఎంతో పరిశుభ్రంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఒక్కొకరికి రెండు జతల దుస్తులు, రెండు తువ్వాలలు సుమారు 400 మంది సిబ్బందికి అందజేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ , సీనియర్ అసిస్టెంట్ శ్రీపాల్ , జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు లేకుండానే.. సమగ్ర ప్రణాళిక విధానాలను అందిస్తున్న పీఎం గతిశక్తి

న్యూ ఢిల్లీ, ఆగష్టు 13:దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనను మరింత వేగవంతం చేసేందుకు, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు 2021 అక్టోబర్‌లో ప్రారంభించిన ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ (పీఎంజీఎస్ ఎన్ఎంపీ) కీలక సాధనంగా మారింది. ఇది కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాలను ఒకే తాటిపైకి తెచ్చే ఒక పరివర్తనాత్మక "సమగ్ర ప్రభుత్వ" విధానం. మౌలిక సదుపాయాల అభివృద్ధిని పర్యవేక్షించడానికి, ప్రణాళిక చేయడానికి, సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి భౌగోళిక సమాచారం, ఉపగ్రహ చిత్రాలు ఏపీఐ ఇంటిగ్రేషన్‌లను ఉపయోగించడం ద్వారా డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునేలా మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలను సులభతరం చేయడమే పీఎంజీఎస్ ఎన్ఎంపీ లక్ష్యం. వివిధ రకాల రవాణా మార్గాల ద్వారా ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు అంతరాయం లేని, సమర్థవంతమైన అనుసంధానాన్ని అందించడానికి ఇది ఉపయోగపడుతుంది. తద్వారా సామాజిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో సహా ఆయా ప్రాజెక్టులను ఏకీకృత, సమకాలీకరించిన, సమన్వయ పద్ధతిలో ప్రణాళిక చేయడానికి వీలవుతుంది. ఇది క్షేత్ర స్థాయిలో చివరి వ్యక్తి వరకు అనుసంధానతను మెరుగుపరచడమే కాకుండా ప్రయాణ సమయాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుంది.

పీఎం గతిశక్తి అనేది కేవలం ఒక సమగ్ర ప్రణాళికా వ్యవస్థ మాత్రమేనని, దీని కింద ప్రాజెక్టుల ఆమోదం, అమలు ప్రక్రియలను ఆయా కేంద్ర మంత్రిత్వ శాఖలు,విభాగాలు, రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాలే స్వయంగా చేపడతాయని స్పష్టమైంది. ఆయా శాఖలు తమ స్వంత ప్రణాళికలు, పథకాలు, విధానాలు, బడ్జెట్, ఆర్థిక నిధుల నిబంధనల ప్రకారమే ఈ పనులను నిర్వహిస్తాయి. పీఎం గతిశక్తి కార్యక్రమం కింద నిర్దిష్టంగా ఎలాంటి పరిమాణాత్మక లక్ష్యాలను లేదా ప్రత్యేక వ్యయ అవసరాలను కేటాయించలేదు. ప్రధానమంత్రి గతిశక్తి విధానం కింద ఏర్పాటైన నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్‌పీజీ), కేంద్ర ప్రభుత్వానికి చెందిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రణాళిక దశలోనే సమగ్రంగా సమీక్షిస్తోంది. ప్రాజెక్టుల రూపకల్పనలో సమగ్ర ప్రణాళిక, బహుళ విధానాలు, ఇతర విధానాలు, వివిధ శాఖల ఉమ్మడి ప్రయత్నాల సమకాలీకరణ, చివరి మైలు అనుసంధానం, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, డేటా ఆధారిత నిర్ణయాలను నిర్ధారించడానికి ఈ ఎన్‌పీజీ నిర్వహణా విధానం పనిచేస్తుంది. ఇప్పటి వరకు దాదాపు రూ. 18.66 లక్షల కోట్ల అంచనా వ్యయంతో కూడిన 396 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఎన్‌పీజీ విధానం ద్వారా ఇప్పటివరకు మూల్యాంకనం చేశారు. ఈ 396 ప్రాజెక్టులలో ఇప్పటికే 256 ప్రాజెక్టులకు ఆమోదం లభించగా, వాటిలో 198 ప్రాజెక్టులు ప్రస్తుతం అమలు దశలో ఉన్నాయి. వీటికి సంబంధించిన మంత్రిత్వ శాఖల వారీ పూర్తి వివరాలను అనుబంధం-ఏలో పొందుపరిచారు.

ప్రభుత్వం తన వివిధ పథకాలు, కార్యక్రమాల అమలు తీరును తెలుసుకోవడానికి ఎప్పటికప్పుడు వివిధ అధ్యయనాలు, సర్వేల ద్వారా సమీక్షలు నిర్వహిస్తోంది. వీటితో పాటు పలు విశ్వవిద్యాలయాలు, పరిశోధకులు సైతం వీటిపై ప్రత్యేక అధ్యయనాలు జరుపుతున్నారు. ఈ నివేదికల ప్రకారం పీఎం గతిశక్తి, జాతీయ లాజిస్టిక్స్ విధానం ప్రగతి, సాగర్‌మాల వంటి సమగ్ర ప్రణాళికా కార్యక్రమాలతో పాటు ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, డెడికేటెడ్ రైల్ ఫ్రైట్ కారిడార్లు, రైల్వే ట్రాక్‌లు, పారిశ్రామిక కారిడార్లు, హబ్‌ల వంటి అనుసంధాన మౌలిక సదుపాయాల అభివృద్ధి దేశ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి. ఇవి ఒకదానితో ఒకటి అనుసంధానమై, అంతర్జాతీయంగా పోటీ పడగల సత్తా ఉన్న నవ భారత విజన్‌కు రూపకల్పన చేశాయి. ఈ చర్యల వల్ల దేశంలో లాజిస్టిక్స్ సామర్థ్యం, టర్న్-అరౌండ్ సమయం (వస్తువుల రవాణా సమయం), వ్యాపార సౌలభ్యం మెరుగవ్వడమే కాకుండా పారిశ్రామిక వృద్ధి పెరిగి, రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని డీపీఐఐటీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) భాగస్వామ్యంతో 2025లో దేశంలో లాజిస్టిక్స్ వ్యయంపై ఒక ప్రత్యేక అంచనాను నిర్వహించింది. ఈ నివేదిక ప్రకారం ప్రస్తుతం దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు దేశ మొత్తం జీడీపీలో 7.9 శాతంగానే నమోదైంది. ఈ ఘనత ప్రపంచంలోని అత్యంత అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల రవాణా వ్యయంతో సమానంగా ఉండటం విశేషం. ఇదే అంశాన్ని ఆర్థిక సర్వే 2023-24 కూడా ప్రముఖంగా ప్రస్తావిస్తూ.. ఈ సంస్కరణల వల్ల దేశీయ ఉత్పాదక రంగం, ఎగుమతుల పోటీతత్వం ఎంతో మెరుగయ్యాయని స్పష్టం చేసింది. జాతీయ రహదారుల ప్రాజెక్టుల అభివృద్ధి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై బెంగళూరులోని ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఒక ప్రత్యేక అధ్యయనం చేపట్టింది. జాతీయ రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి కూడా దేశ స్థూల దేశీయోత్పత్తిలో ఏకంగా రూ.3.2 వృద్ధికి దారి తీస్తుందని తన అధ్యయనంలో తెలిపింది.ఇప్పటివరకు 58 కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, దేశంలోని మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ పరిధిలోకి వచ్చాయి. రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, జలమార్గాలు, విద్యుత్, పెట్రోలియం, సహజ వాయువు, పౌర విమాన యానం, టెలికమ్యూనికేషన్స్, పారిశ్రామిక కారిడార్లు వంటి అన్ని కీలక మౌలిక సదుపాయాల రంగాలు దీని పరిధిలోకి వచ్చాయి. దీనితో పాటు జిల్లా స్థాయి ప్రణాళికల కోసం కూడా పీఎం గతిశక్తి వినియోగాన్ని మరింత విస్తరించాలని రాష్ట్రాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సెప్టెంబర్ 2025లో పీఎం గతిశక్తి వేదికను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇది ప్రైవేటు సంస్థలకు, సాధారణ ప్రజలకు సైతం పీఎం గతిశక్తి డేటా అనలిటిక్స్ అందుబాటులోకి తెచ్చింది. ఈ వేదికపై ఉన్న సులభమైన క్వెరీ-ఆధారిత విధానం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తమకు కావలసిన సమాచారాన్ని నివేదికల రూపంలో పొంది, వాటి ఆధారంగా తమ ప్రాజెక్టులను సులభంగా ప్రణాళిక చేసుకోగలుగుతున్నాయి. ఈ డిజిటల్ వ్యవస్థలో ఇప్పటివరకు సుమారు 1800 డేటా లేయర్లను అనుసంధానించారు. భాగస్వాములందరి సౌకర్యార్థం 65కు పైగా సాఫ్ట్‌వేర్ మాడ్యూల్స్, విభాగాలు, 100కు పైగా మొబైల్, వెబ్ అప్లికేషన్లను అభివృద్ధి చేసి ఈ వేదికలో చేర్చారు.

# ఎయిర్ ఇండియా విమానం ఏఐ 2379 (ఫుకెట్-ఢిల్లీ) ఘటనపై దర్యాప్తు

న్యూఢిల్లీ, ఆగష్టు 13:ఫుకెట్ నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తున్న ఎ320 ఎయిర్‌బస్ రిజిస్ట్రేషన్ వీటీ-ఈఎక్స్ఓ ఎయిర్ ఇండియా విమానం ఏఐ2379 ఈ నెల 4న ప్రయాణ సమయంలో అకస్మాత్తుగా సుమారు 300 అడుగుల ఎత్తులో కుదుపులకు లోనయింది. ఆ తర్వాత నిలకడ స్థితికి చేరుకున్న విమానం ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయింది.

ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు క్యాబిన్ సిబ్బంది గాయపడ్డారు. విమానంలో ముగ్గురు చిన్నారులు సహా మొత్తం 137 మంది ప్రయాణికులు... ఇద్దరు పైలట్లు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది సహా మొత్తం ఎనిమిది మంది సిబ్బంది ఉన్నారు.

డీజీసీఏ నుంచి అందిన సమాచారం, ఘటన స్వభావం ఆధారంగా... వర్తించే నిబంధనలు, ఐసీఏవో విధానాలకు అనుగుణంగా 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' (ఏఏఐబీ) సమగ్ర దర్యాప్తును చేపట్టింది. ఐసీఏవో, సంబంధిత దేశాలకు ఈ ఘటన గురించి అవసరమైన సమాచారాన్ని అందించారు.

ఇటువంటి రకం విమాన ప్రమాద ఘటనలకు సంబంధించిన విచారణలో విమానాన్ని 'రూపొందించిన దేశం', 'తయారుచేసిన దేశం' పాల్గొనడం ఐసీఏవో నిబంధనల ప్రకారం నిర్దేశించిన అంతర్జాతీయ దర్యాప్తు విధానంలో కీలక భాగంగా ఉంటుంది.

దీనికి అనుగుణంగా, సంబంధిత దేశానికి చెందిన దర్యాప్తు సంస్థ... ఫ్రాన్స్‌కు చెందిన 'పౌర విమానయాన భద్రతపై విచారణ-విశ్లేషణ విభాగం' (బీఈఏ), ఎయిర్‌బస్ సాంకేతిక ప్రతినిధులతో కలిసి, వర్తించే ఐసీఏవో విధానాల ప్రకారం ఏఏఐబీకి అవసరమైన సాంకేతిక సహాయాన్ని (సంబంధిత సాంకేతిక సమాచారం, రూపకల్పన పత్రాలను అందించడం సహా) అందజేస్తోంది.

సంబంధిత సాంకేతిక, కార్యాచరణ, వైద్య, మానవ కారకాలకు సంబంధించిన అన్ని ఆధారాలను క్రమపద్ధతిలో సేకరించడం, భద్రపరచడం, పరిశీలించడంలో ఏఏఐబీ ప్రస్తుతం నిమగ్నమై ఉంది. విమానం, దాని వ్యవస్థల పరిశీలన, రికార్డ్ అయిన విమాన ప్రయాణ డేటా, సంబంధిత కార్యాచరణ-నిర్వహణ రికార్డులు, వైద్య సమాచారం, సంబంధిత వ్యక్తులతో ఇంటర్వ్యూలు ఇందులో భాగంగా ఉంటాయి. ఏవైనా నిర్ధారణలకు రాకముందు, అన్ని భౌతిక ఆధారాలను సమగ్రంగా పరిశీలిస్తారు.

జరిగిన ఘటనకు సంబంధించిన పరిస్థితులను, దోహదపడిన కారకాలను నిర్ధారించడం... ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి తగిన భద్రతా చర్యలను గుర్తించడం ఈ దర్యాప్తు లక్ష్యం. ఈ దర్యాప్తు స్వతంత్రమైనది, సాక్ష్యాధారాలతో కూడినది, సమగ్రమైనది. దర్యాప్తు జరుగుతున్న కాలంలో ఏ ఒక్క సమాచారం ఆధారంగానైనా ఘటనకు గల కారణం గురించి ఎటువంటి నిర్ధారణకు రాకూడదు.

విచారణ సమయంలో సేకరించిన కొన్ని రికార్డులు, వాంగ్మూలాలు, వైద్య సమాచారం, ఇతర సామగ్రిని వర్తించే విచారణ విధానం ప్రకారం సురక్షితంగా, గోప్యంగా ఉంచుతారు. వాస్తవాలను నిజాయతీగా, నిష్పాక్షికంగా, సాంకేతికంగా సరైన రీతిలో నిర్ధారించడం కోసం దర్యాప్తు ప్రక్రియ సమగ్రతను, గోప్యతను కాపాడటం అత్యవసరం. మీడియా, ప్రజలు సహా సంబంధిత వర్గాలంతా విచారణ ప్రక్రియను గౌరవించాలనీ... అసంపూర్ణమైన, ధృవీకరించని లేదా ఎంపిక చేసిన సమాచారం ఆధారంగా నిర్ధారణలకు రాకూడదని ఏఏఐబీ విజ్ఞప్తి చేస్తోంది.

ఏఏఐబీ అన్ని కీలక వాస్తవాలు, సంబంధిత సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర విచారణను నిర్వహిస్తుంది. వర్తించే నిబంధనలు, ఐసీఏవో ప్రోటోకాల్‌లకు అనుగుణంగా నిర్ణీత కాలవ్యవధిలో తన ప్రాథమిక పరిశీలనలను వెల్లడిస్తుంది. విచారణ ప్రక్రియ తగిన దశలో మరింత సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతారు.

అత్యంత ప్రాధాన్యంగా విమానయాన భద్రతను లక్ష్యంగా చేసుకుని... స్వతంత్రమైన, పారదర్శకమైన, ప్రొఫెషనల్ దర్యాప్తు నిర్వహణకు ఏఏఐబీ కట్టుబడి ఉంది.

# తృటిలో తప్పిన ప్రమాదం




ఖమ్మం, ఆగష్టు 13:మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం శివారులోని రైస్‌మిల్లుకు వెళ్లే రహదారిలో మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ ప్రయాణిస్తున్న కారు గురువారం ప్రమాదానికి గురైంది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పినట్లైంది.


స్థానికుల కథనం ప్రకారం.. ముందుగా వెళున్న ఓ ద్విచక్రవాహనం అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో, ఎదురుగా వస్తున్న కూలీలను తప్పించేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు డ్రైవర్ వాహనాన్ని నెమ్మదిగా నడిపారు. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు.. మాజీ ఎమ్మెల్యే కారు వెనుక భాగాన్ని ఢీకొట్టింది.

దీంతో మాజీ ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు వెనుక భాగం దెబ్బతింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న అబ్బాయిపాలెం, ధారావత్ తండా గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని రెడ్యా నాయక్‌ను పరామర్శించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.






# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి



ఖమ్మం, ఆగష్టు 13: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సొంతింటి కలను సాకారం చేసుకోవాలని అన్నారు.

బుధవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ ఒక్కో ఇంటిని పరిశీలించారు. పునాదులు, గోడలు, స్లాబ్, పైకప్పు, తుదిదశ పనుల పురోగతిని తనిఖీ చేశారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా పర్యవేక్షించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ, నిర్దిష్ట గడువులోగా నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఉత్సుకతతో ఉండాలని, ప్రశ్నలు అడగాలని, విజ్ఞాన శాస్త్రాన్ని వృత్తిగా చేపట్టాలని విద్యార్థులను ప్రోత్సహించిన డాక్టర్ రాజీవ్ బహ్ల్

న్యూఢిల్లీ, ఆగష్టు 13:ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్), భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) సంయుక్తంగా నిర్వహించే ఐసీఎంఆర్-షైన్ (సైన్స్ అండ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫర్ నెక్స్ట్‌జెన్ ఎక్స్‌ప్లోరర్స్) రెండో ఎడిషన్ ఇవాళ ప్రారంభమైంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులను ప్రయోగశాలల్లోకి ఆహ్వానించి, ప్రయోగాలను నేరుగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. విద్యార్థులు ఒకరోజు శాస్త్రవేత్తగా గడపాలంటూ ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు రెండు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం ఆగస్టు 11, 12వ తేదీల్లో దేశవ్యాప్తంగా 83 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. ఐసీఎంఆర్ సంస్థలు, మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్లు (ఎంఆర్ హెచ్ఆర్ యూలు), వాటికి అనుబంధంగా ఉండే క్షేత్ర స్థాయి విభాగాలు ఇందులో భాగంగా ఉన్నాయి. దాదాపు 10,000 అడుగుల ఎత్తులో ఉన్న హిమాచల్‌ప్రదేశ్‌లోని కేలాంగ్ నుంచి దక్షిణాన కేరళ వరకు? పశ్చిమాన దయ్యూ నుంచి తూర్పున నాగాలాండ్ వరకు దేశవ్యాప్తంగా విద్యార్థులను ఈ కార్యక్రమం చేరుకుంటుంది. ఇది వారిని విజ్ఞాన శాస్త్రానికి చేరువ చేయటమే కాక, శాస్త్రీయ పరిశోధనలపై ఉత్సుకతను, ఆసక్తిని పెంపొందిస్తుంది.

ఈ కార్యక్రమంలో డీహెచ్ఆర్ కార్యదర్శి, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహ్ల్ మాట్లాడుతూ.. "ఇవాళ ఇక్కడున్న విద్యార్థులను నేను ఒకటే కోరుతున్నా. ఎల్లప్పుడూ ఉత్సుకతతో ఉండండి. ప్రశ్నలు అడగండి. ఎందుకు అని ప్రశ్నించేందుకు ఎప్పుడూ భయపడవద్దు. ప్రశ్నతోనే ఆవిష్కరణ మొదలవుతుంది. నూతన అవకాశాలను అన్వేషించే ధైర్యంతోనే కొత్త ఆవిష్కరణ ప్రారంభమవుతుంది. షైన్ కార్యక్రమంలోని మీ అనుభవం? ఆరోగ్య పరిశోధనకు సంబంధించి అద్భుతమైన ప్రపంచాన్ని మీకు పరిచయం చేస్తుందని, సైన్స్‌ను కేవలం సబ్జెక్టుగా మాత్రమే కాక, ప్రజల జీవితాల్లో అర్థవంతమైన మార్పును తీసుకువచ్చే కెరీర్‌గా ఎంచుకునేలా మీకు స్ఫూర్తిని కలిగిస్తుందని నేను ఆశిస్తున్నా" అని అన్నారు.

సైన్స్, ఆరోగ్యం, పరిశోధనలపై విద్యార్థుల ప్రశ్నలకు సులభంగా అర్థమయ్యే ఉదాహరణలతో డాక్టర్ రాజీవ్ బహ్ల్ సమాధానమిచ్చారు. ఎప్పుడూ ఆసక్తితో ఉంటూ, పాఠ్యపుస్తకాలను దాటి ఆలోచించాలని ప్రోత్సహించారు. ఐసీఎంఆర్ పరిశోధనలు, ఆవిష్కరణల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. దీనివల్ల శాస్త్రీయ ఆవిష్కరణలు వాస్తవ ప్రపంచ ఆరోగ్య సవాళ్లకు పరిష్కారాలుగా మారే విధానాన్ని విద్యార్థులు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 9 నుంచి 12వ తరగతుల విద్యార్థులు ఈ రెండు రోజుల్లో నేరుగా ఆరోగ్య పరిశోధనా ప్రపంచంలోకి అడుగుపెడతారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు గైడెడ్ ల్యాబొరేటరీ టూర్లు, పరిశోధన ప్రదర్శనలు, పోస్టర్ వాక్స్, వీడియో ప్రజెంటేషన్లు, శాస్త్రీయ పనుల ప్రత్యక్ష ప్రదర్శనలను వీక్షిస్తారు. ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలతో మాట్లాడి? వారి పరిశోధనా ప్రయాణాలు, నైపుణ్యాలు, ప్రజారోగ్య రంగంలో రోజువారీ పనుల గురించి తెలుసుకుంటారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనే యువతకు శాస్త్రీయ ఉత్సుకత స్ఫూర్తిని అందించేందుకు షైన్ అధికారిక చిహ్నం- డాక్టర్ క్యూరియోని రూపొందించారు. ప్రచార సామాగ్రి, పోస్టర్లు, సోషల్ మీడియాలో, ఐసీఎంఆర్ పనుల గురించి వివరించే పరస్పర సంభాషణ వీడియోలో వ్యాఖ్యాతగా కూడా డాక్టర్ క్యూరియో మస్కట్ వ్యవహరిస్తుంది.

ఈ సందర్భంగా అధికారిక షైన్ వెబ్‌సైట్ ను ఐసీఎంఆర్ ప్రారంభించింది. ఆరోగ్య పరిశోధనలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం వనరులు, తాజా సమాచారం, అవకాశాలను అందించే ప్రత్యేక వేదిక ఇది. దీనితో పాటు విద్యార్థులు స్వయంగా పరిశోధనా ప్రశ్నలను రూపొందించేందుకు, వాస్తవ జీవిత ప్రజా ఆరోగ్య సవాళ్లకు తగిన పరిష్కారాలను సూచించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా పాఠశాల పోటీలను కూడా ఐసీఎంఆర్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న ఐసీఎంఆర్ ప్రయోగశాలల నుంచి వచ్చిన ఆహ్వానాల మేరకు తదుపరి కార్యక్రమంలో సుమారు 30,000 మంది విద్యార్థులు పాల్గొంటారని అంచనా.

పరిశోధనా సంస్థలు, కేంద్రాలను సందర్శించేందుకు అనుమతించటం ద్వారా విజ్ఞాన శాస్త్రం స్పష్టంగా అర్థమయ్యేలా, అందరికీ చేరువయ్యేలా చేసేందుకు ఈ కార్యక్రమం ప్రయత్నిస్తుంది. సమాజం ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను పరిశోధనలు పరిష్కరించే విధానాన్ని ఈ కార్యక్రమం విద్యార్థులకు తెలియజేస్తుంది. శాస్త్రీయ పరిశోధనలో భవిష్యత్తును చూసుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తుంది. వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా ఉన్న ఈ కార్యక్రమం? దేశ యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఐసీఎంఆర్ నిబద్ధతను స్పష్టం చేస్తుంది. భారతదేశ ఆరోగ్య, అభివృద్ధి లక్ష్యాలకు ఉపయోగపడే భవిష్యత్ తరం పరిశోధకులకు ఇది స్ఫూర్తినిస్తుంది.

# పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాస, ఆరోగ్య అవగాహన పెంపునకు ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ 'షైన్ 2026' కార్యక్రమ నిర్వహణ

న్యూఢిల్లీ, ఆగష్టు 13:పాఠశాల విద్యార్థులకు ఆసక్తికరమైన విజ్ఞానశాస్త్రం, పోషకాహారం, ప్రజారోగ్య రంగాలను పరిచయం చేయడం లక్ష్యంగా భవిష్యత్తు తరం పరిశోధకుల కోసం సైన్స్, వైద్య ఆవిష్కరణల కార్యక్రమాన్ని (షైన్-2026) హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-జాతీయ పోషకాహార సంస్థ (ఐసీఎంఆర్-ఎన్ఐఎన్) నేడు ప్రారంభించింది. ఈ కార్యక్రమం ఆగస్టు 11, 12 తేదీల్లో జరగనుంది.

ఐసిఎమ్ఆర్-ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కాగా, పలువురు శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. షైన్ 2026 మొదటి రోజున తొమ్మిది పాఠశాలలకు చెందిన సుమారు 800 మంది విద్యార్థులు ఎన్ఐఎన్ క్యాంపస్‌ను సందర్శించారు. హాజరైన వారిలో దాదాపు సగం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు చెందినవారు కావడం విశేషం. ముఖ్యంగా హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల నుంచి, వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన ఈ విద్యార్థులకు దేశంలోనే అత్యున్నత పోషకాహార పరిశోధనా సంస్థను సందర్శించే అరుదైన అవకాశం లభించింది. శాస్త్రవేత్తలతో ప్రత్యక్ష సంభాషణలు, ప్రదర్శనలు, వివిధ రకాల చేతితో చేసే కార్యకలాపాల ద్వారా పిల్లలు సైన్స్ అంశాలను స్వయంగా అనుభవపూర్వకంగా తెలుసుకుని ఉత్సాహం కనబరిచారు.

ఈ కార్యక్రమ పరిధి కేవలం హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంగణానికే పరిమితం కాలేదు. ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ అనుబంధ సంస్థలైన తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా జనంపేట,ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రగిరిలో ఉన్న మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్లలో (ఎంఆర్‌హెచ్ఆర్‌యూలు) కూడా వందలాది మంది గ్రామీణ పాఠశాలల విద్యార్థులు ఈ షైన్ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. దీంతో ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని సంస్థ ప్రాంగణానికే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాలు, స్థానిక సమాజాలకు కూడా శాస్త్రీయ అవగాహనను విస్తరిస్తోంది.

పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఆరోగ్యం, పోషకాహారం, శాస్త్రీయ పరిశోధనలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఐసీఎంఆర్ ఈ షైన్ కార్యక్రమాన్ని చేపట్టింది. నిత్యజీవితంలో ఎదురయ్యే ఆరోగ్య సవాళ్లను శాస్త్రీయ పరిశోధనలు ఏ విధంగా పరిష్కరిస్తాయనే విషయాన్ని విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. విద్యార్థులు స్వయంగా ప్రయోగాల ప్రదర్శనలను తిలకించడం, పరస్పర సంభాషణల ద్వారా అభ్యాసన అనుభవాన్ని పొందడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐసీఎంఆర్-జాతీయ పోషకాహార సంస్థ డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే పిల్లలకు సైన్స్, పరిశోధనలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను వివరించారు. షైన్ వంటి ఇంటరాక్టివ్ కార్యక్రమాలు పిల్లల్లో ఉత్సుకతను, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తాయని, అలాగే ఆరోగ్యం-పోషకాహారం పట్ల సాక్ష్యాధారిత విధానాలపై గౌరవాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం ప్రశ్నలు అడగాలని, కొత్త ఆలోచనలను అన్వేషించాలని, సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను కనుగొనే మార్గంగా సైన్స్‌ను ఎంచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

# సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు చేయాలి




నల్గొండ, ఆగష్టు 13: సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం మహార్యాలీ లో భాగంగా భారీ ప్రదర్శన చేశారు.

కొత్త బస్టాండ్ నుండి పెద్దఎత్తున విద్యార్థులు 60 ఫీట్ల రోడ్డు, వాణిజ్య భవన్ సెంటర్ వద్ద వేలాదిమంది విద్యార్థులు భారీ నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రధాన వాణిజ్య, విద్యా, పారిశ్రామిక కేంద్రాన్ని బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ నుంచి తొలగించడం సరి కాదన్నారు. రైల్వే లైన్ సూర్యాపేట ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అన్నారు.

బుల్లెట్ ట్రైన్ సాధన కోసం దశలవారీగా ఉద్యమంలో భాగస్వామ్యం అవుతామన్నారు.

# నిజామాబాద్ జిల్లాలో యాక్సిడెంట్

నిజామాబాద్, ఆగష్టు 13: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోవింద్‌పేట్ ఫ్లైఓవర్‌పై ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును కంటైనర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు డివైడర్‌పై కూర్చున్న ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు.

పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ప్రైవేట్ బస్సు టైర్ పంచర్ కావడంతో డ్రైవర్ దాన్ని గోవింద్‌పేట్ ఫ్లైఓవర్‌పై రోడ్డుపక్కన నిలిపాడు. బస్సు మరమ్మతు కోసం ఆగిన సమయంలో ఇద్దరు మహిళలు బస్సు ఎదురుగా ఉన్న డివైడర్‌పై కూర్చున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ అదుపు తప్పి ఆగి ఉన్న బస్సును బలంగా ఢీకొట్టింది.

కంటైనర్ ఢీకొనడంతో బస్సు ఒక్కసారిగా ముందుకు కదిలింది. దీంతో డివైడర్‌పై కూర్చున్న మహిళలపైకి బస్సు దూసుకెళ్లింది. బస్సు టైర్లు వారి మీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంతో ఫ్లైఓవర్‌పై ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది.

**మృతుల వివరాలు తెలియాల్సి ఉంది**

ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మృతుల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదానికి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

కంటైనర్ లారీ డ్రైవర్ వేగం, నిర్లక్ష్యం తదితర అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్మూర్ సబ్ కలెక్టర్



నిజామాబాద్, ఆగష్టు 13:నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా భూ-భారతి రికార్డులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రెవెన్యూ, భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, వివిధ దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.భూముల రికార్డుల నిర్వహణ, ధరణి/భూ సంబంధిత దరఖాస్తులు, మ్యుటేషన్, వారసత్వం, భూ సమస్యలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించినట్లు తెలిసింది.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను తెలుసుకొని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. అలాగే కార్యాలయంలో రికార్డులను క్రమపద్ధతిలో భద్రపరచాలని, రెవెన్యూ వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు.ఈ తనిఖీలో తహసిల్దార్ ఎం.కిరణ్ కుమార్,డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్,ఎలక్షన్ డీటీ అశ్విన్ బాబు,ఆర్ఐలు మల్లేష్, స్వాతి, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గా మైసమ్మ ఆలయానికి ఎమ్మెల్యే దంపతుల భూమిపూజ



మహబూబ్‌నగర్, ఆగష్టు 13:అచ్చంపేట పట్టణంలోని 8వ వార్డు ఇందిరానగర్ కాలనీలో శ్రీశ్రీశ్రీ దుర్గా మైసమ్మ దేవాలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఆయన సతీమణి, సిబిఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ డా. అనురాధ కలిసి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ దంపతులు మాట్లాడుతూ.. ప్రజల విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావాలకు అనుగుణంగా ఆలయ నిర్మాణానికి సహకరించడం సంతోషంగా ఉందన్నారు. దుర్గా మైసమ్మ అమ్మవారి ఆశీస్సులతో అచ్చంపేట ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం కొనసాగిస్తామని తెలిపారు.

# ఉమామహేశ్వరంలో మహా వరుణ యాగం



మహబూబ్‌నగర్, ఆగష్టు 13: శ్రీశైలం ఉత్తర ద్వారంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం మహా వరుణ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఆయన సతీమణి డాక్టర్ చిక్కుడు అనురాధ దంపతులు యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నల్లమల అడవుల మధ్య ప్రకృతి రమణీయత నడుమ కొలువైన ఉమామహేశ్వర క్షేత్రానికి ఎంతో విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు సస్యశ్యామలంగా వర్ధిల్లాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మహా వరుణ యాగాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు యాగానికి ఏర్పాట్లు చేశారు. వేద పండితులు, ఆలయ అర్చకుల మంత్రోచ్చారణల మధ్య యాగ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మూడు గంటలపాటు జలదిగ్బంధంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, వేద పండితులు, అర్చకులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) పరిధిలో ఈ-ఎఫ్ఐఆర్ నమోదు

న్యూ ఢిల్లీ, ఆగష్టు 13:కేసు పెట్టదగిన నేరం జరిగినప్పుడు, దానికి సంబంధించిన సమాచారాన్ని ఆ నేరం ఏ ప్రాంతంలో జరిగినప్పటికీ, పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారి సమక్షంలో మౌఖికంగా, లేదా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారానైనా తెలియజేయవచ్చునని 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023' లోని 173వ సెక్షన్ సూచిస్తోంది. నోటిమాటగా సమాచారాన్ని తెలియజేస్తే, అప్పుడు ఆ విషయాన్ని అధికారి కాగితాల్లో రాసుకుని నమోదు చేసుకుంటారు. ఆ పత్రాలపై.. నేరం జరిగిందని తెలిపిన వ్యక్తి సంతకం చేయాల్సి ఉంటుంది. సమాచారాన్ని ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ రూపంలో తెలియజేసినట్లయితే, సంబంధిత పోలీస్ స్టేషన్‌లోని అధికారి దానిని రాతపూర్వకంగా నమోదు చేసుకుని మూడు రోజుల లోపల ఆ పత్రాలపై, విషయాన్ని తెలియజేసిన వ్యక్తి సంతకాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. ఈ-ఎఫ్ఐఆర్ లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా తెలియజేసిన సమాచారాన్ని రికార్డు చేయడానికి, ఆ సమాచారాన్ని అందించిన వ్యక్తి మూడు రోజుల గడువు లోపల సమాచార పత్రంపై సంతకాలు చేయవలసి ఉంటుందని 'బీఎన్ఎస్ఎస్-2023' సూచిస్తోంది.

# 'భారత్ జీఐ' బ్యానర్ ప్రారంభం.. ప్రాంతీయ జీఐ ఉత్పాదనలను ఓఎన్‌డీసీ, జీఈఎమ్ వేదికల్లో చేర్చనున్న ఎమ్ఎస్ఎమ్ఈ శాఖ, డీపీఐఐటీ

న్యూ ఢిల్లీ, ఆగష్టు 13:భౌగోళిక గుర్తింపు (జీఐ) కలిగిన ఉత్పాదనలు భారత్‌లో విరివిగా ఉన్న నేపథ్యంలో వాటి ఆర్థిక సామర్థ్యాన్ని పూర్తిగా సద్వినియోగపరుచుకొనే దిశగా ఒక ముఖ్య ఘట్టం చోటుచేసుకుంది. ఈ అంశంపై ఒక అవగాహన ఒప్పందాన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎమ్ఎస్ఎమ్ఈ) మంత్రిత్వశాఖ, డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) 2026 ఆగస్టు 5న న్యూఢిల్లీ వాణిజ్య భవన్లో కుదుర్చుకున్నాయి. ఒప్పంద పత్రంపై ఎమ్ఎస్ఎమ్ఈ శాఖ డైరెక్టరు ఎండీ. సాలిక్ పర్వేజ్, డీపీఐఐటీ ఐపీఆర్ విభాగం డైరెక్టరు శ్రీ కరణ్ థాపర్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమం లో రెండు సంస్థల సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సాంప్రదాయిక పరిశ్రమలతో పాటు చేతివృత్తుల వారి సమగ్ర అభివృద్ధి, ఆర్థిక సౌష్ఠవానికి సంబంధించిన అంశాలకు ఎమ్ఎస్ఎమ్ఈ శాఖ నోడల్ మంత్రిత్వశాఖగా ఉంది. కాగా భౌగోళిక గుర్తింపు కలిగిన వస్తువుల (నమోదు, పరిరక్షణ) చట్టం- 1999ని అనుసరించి భారత్లో భౌగోళిక గుర్తింపులకు సంబంధించిన నమోదు, చట్టపరమైన పరిరక్షణ విషయాలకు డీపీఐఐటీ నోడల్ విభాగంగా పనిచేస్తోంది. జీఐలను చట్టపరంగా నమోదు చేయడం వల్ల ప్రాంతీయ అస్తిత్వాన్ని పరిరక్షించవచ్చుని, అయితే ఆయా స్థానిక హస్తకళా ఉత్పాదనలను పెద్ద ఎత్తున తయారు చేసి, వాణిజ్యపరంగా లాభదాయకమైనవిగా ఉండేటట్లు చూస్తూ, ఎగుమతికి సిద్ధం చేసే వాణిజ్య సంస్థలుగా రూపొందిస్తే వాటి ఆర్థిక విలువను గణనీయంగా పెంచవచ్చునీ, అందుకు సమన్వయపూర్వక ప్రయత్నాలు ఎంతైనా అవసరమనీ ఎమ్ఎస్ఎమ్ఈ శాఖ, డీపీఐఐటీ గుర్తించాయి. ఈ భావనకు అనుగుణంగా ఒప్పంద పత్రం భారతీయ జీఐ ఉత్పాదనల వాణిజ్యీకరణ, నాణ్యత ప్రమాణీకరణ, మార్కెట్టు లభ్యతలను వేగవంతం చేయడానికి ఒక సహకారపూర్వక ప్రాథమిక ప్రణాళికను రూపొందిస్తుంది. దీంతో స్వదేశీ చేతివృత్తి దారులకు, నేతకారులకు, ఉత్పత్తిదారులకు జీవనోపాధి మెరుగుపడడమే కాకుండా దేశం లో ఒక జిల్లా ఒక ఉత్పాదన విస్తారిత అనుబంధ వ్యవస్థ కూడా బలోపేత మవుతుంది.ఈ రెండు సంస్థలూ తమ కార్య క్రమ డిజైను, అమలు ప్రక్రియల్లో ఓడీఓపీని ఏకీకరించే దిశగా కలిసి పనిచేయనున్నాయి. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ తో పాటు, ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మార్కెట్‌ప్లేస్ వేదికల్లో జీఐ సంఘాలనూ, అధీకృత వినియోగదారులనూ కలుపుకొని పోవడానికి కూడా "భారత్ జీఐ" బ్యానరుతో మార్గాన్ని సుగమం చేస్తాయి. జీఐ ట్యాగ్ కలిగిన ఉత్పాదనలను దేశీయ, అంతర్జాతీయ స్థాయుల్లో విక్రయాలకు ఉద్దేశించిన వాణిజ్య ప్రదర్శనలు, కొనుగోలుదారు, అమ్మకందారు సంస్థల సమావేశాలు, ఎగ్జిబిషన్లలో ప్రత్యేక జీఐ పెవిలియన్లకు సహ స్పాన్సర్లుగానూ వ్యవహరిస్తాయి.

# విశాఖపట్నం ఓడరేవులో కార్గో తరలింపు సౌలభ్యం కోసం రూ.334.89 కోట్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి నౌకాశ్రయాలు, నౌకాయానం, జలరవాణా మంత్రిత్వశాఖ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగష్టు 13:సరుకు రవాణాను మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, ఓడరేవు ప్రాంగణంలో రాకపోకలను క్రమబద్ధీకరించడం కోసం విశాఖపట్నం పోర్ట్ అథారిటీ వద్ద రూ. 334.89 కోట్ల అంతర్గత ఫ్లైఓవర్ నిర్మాణానికి నౌకాశ్రయాలు, నౌకాయానం, జలరవాణా మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది.

కేంద్ర నౌకాశ్రయాలు, నౌకాయానం, జలరవాణా శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ఆమోదించిన ఈ ప్రాజెక్టును... సదరు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన 'డెలిగేటెడ్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్' (డీఐబీ) పరిశీలించి, అంచనా వేసింది.

ఈ సందర్భంగా శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, "ఈ ప్రాజెక్టు విశాఖపట్నం పోర్టులో కీలకమైన అడ్డంకిని తొలగించి, సరుకు రవాణాను వేగవంతం చేయడంతో పాటు మొత్తం కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆధునికమైన, నిరాటంకమైన, ప్రపంచంతో పోటీపడగల నౌకాశ్రయ మౌలిక సదుపాయాలను నిర్మించడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని అన్నారు.

కాన్వెంట్ జంక్షన్‌ను డాక్ ప్రాంతంతో అనుసంధానిస్తూ ప్రతిపాదించిన 3.584 కిలోమీటర్ల ఈ ఎలివేటెడ్ కారిడార్... పోర్టు పరిధిలో రహదారి, రైలు రద్దీని వేరు చేస్తుంది. అధిక సంఖ్యలో రైళ్ల రాకపోకల కారణంగా రోజుకు సుమారు 18 సార్లు గేట్లు మూసివేయాల్సి వస్తున్న తొమ్మిది ప్రధాన రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద జాప్యం సమస్యను పరిష్కరించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

తరచుగా గేటు మూయడం కారణంగా... రద్దీకి, వాహనాలు ఎక్కువ సేపు వేచి ఉండటానికి, అధిక ఇంధన వినియోగానికి, వాహన నిర్వహణ ఖర్చుల పెరుగుదలకు ఇవి కారణమవుతున్నాయి. ఇవి సరుకు రవాణా సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఎలివేటెడ్ రోడ్ కారిడార్‌ను అందించడం ద్వారా ఈ ప్రాజెక్టు రహదారి, రైలు ట్రాఫిక్ కలిసిపోయే ఇబ్బందిని తగ్గిస్తూ... వాహనాలు, సరుకుల రవాణాను సులభతరం చేస్తుంది. ఈ ప్రాజెక్టులో అనుబంధ సివిల్, ఎలక్ట్రికల్ పనులు, యుటిలిటీ మార్పిడి, భద్రతా సంస్థాపనలు, ఐదేళ్ల నిర్వహణ భాగంగా ఉంటాయి. ముఖ్యంగా కీలకమైన డాక్ ప్రాంతాల్లో కొనసాగుతున్న పోర్టు కార్యకలాపాలకు అంతరాయాన్ని తగ్గించే విధంగా నిర్మాణ ప్రణాళికను రూపొందిస్తారు.

ఈ సందర్భంగా శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, "ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ భారత నౌకా వాణిజ్య రంగాన్ని ఆర్థిక వృద్ధి, స్వయం-సమృద్ధి, జాతీయ అభివృద్ధికి కీలక చోదక శక్తిగా మార్చారు. బలమైన మౌలిక సదుపాయాలు, ప్రగతిశీల సంస్కరణలు, ఆధునిక సాంకేతికత, మన నౌకా వాణిజ్య సామర్థ్యాలపై భారీ పెట్టుబడులతో... వేం ప్రపంచంతో పోటీపడగల సామర్థ్యం కలిగిన, స్వయం-సమృద్ధమైన నౌకా వాణిజ్య వ్యవస్థను నిర్మిస్తున్నాం. 'స్వయం-సమృద్ధ భారత్', 'వికసిత్ భారత్-2047' దిశగా భారత్ ప్రయాణానికి ఇది ఊతమిస్తుంది," అని అన్నారు.

ప్రధానమంత్రి గతిశక్తి విధాన ప్రణాళిక కింద సమీకృత మౌలిక సదుపాయాల ప్రణాళికపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఈ పెట్టుబడి దానికి అనుగుణంగా ఉంది.

# సీఎం సభను విజయవంతం చేయండి

## సభా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు



సంగారెడ్డి, ఆగష్టు 13: (నేటినిజం ప్రతినిధి):లక్ష మందితో ముఖ్యమంత్రి సభ సక్సెస్ చేయాలని ముఖ్యనాయకులకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సూచించారు. ఈ నెల 15న సంగారెడ్డి పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ఏర్పాట్లు, జనసమీకరణ, వాహనాల పార్కింగ్ అంశాలపై జగ్గారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పోలీస్ అధికారులు, ముఖ్య నాయకులతో బుధవారం రాత్రి 8గంటలకు సంగారెడ్డి పట్టణం లోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఐఐటీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బయలుదేరి నేరుగా ఐబీ చౌరస్తాకు చేరుకుంటారని తెలిపారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీల విగ్రహాలను సీఎం ఆవిష్కరిస్తారని చెప్పారు. అనంతరం సీఎం ప్రసంగించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం సభకు ఉమ్మడి మెదక్ జిల్లా నలుమూలల నుంచి వచ్చే లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల వాహనాల కోసం గంజి మైదాన్, మెడికల్ కాలేజీలో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, మంత్రుల వాహనాలకు డీఈవో కార్యాలయంలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

సంగారెడ్డి నియోజకవర్గం నుంచి 50 వేల మందిని సభకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నామని జగ్గారెడ్డి తెలిపారు. అధికారుల ఆధ్వర్యంలో సుమారు 20 వేల మంది లబ్ధిదారులను సభకు తరలించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి సుమారు 5 వేల మందిని, ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించి మొత్తం లక్ష మందితో సీఎం సభను విజయవంతం చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు జగ్గారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత తదితర అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు రఘుగౌడ్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం 150వ వార్షికోత్సవాల సందర్భంగా ఎంపీల హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఆగష్టు 13: జాతీయ గేయం వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ రోజు న్యూఢిల్లీలోని భారత్ మండపం వద్ద పార్లమెంట్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు చేపట్టిన హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు.

జాతీయాభిమానం, ఐక్యత, పౌర భాగస్వామ్య సందేశాన్ని అందిస్తూ.. భారత్ మండపం నుంచి మేజర్ ధ్యాన్ చంద్ జాతీయ స్టేడియం వరకు ఈ ర్యాలీ కొనసాగింది.

మాతృభూమిపై ఉన్న ప్రేమను జాతీయ బాధ్యతగా వందేమాతరం మార్చిందనీ, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి శక్తిమంతమైన వ్యక్తీకరణగా నిలిచిందనీ ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి అన్నారు. అనేక మంది స్వాతంత్ర్య సమరయోధుల్లో ధైర్యం, త్యాగం, ఆశాభావం నిండేలా జాతీయ గేయంలోని చిరస్మరణీయ వాక్యాలు స్ఫూర్తినిచ్చాయని ఆయన గుర్తు చేసుకున్నారు.

ఇటీవలే అండమాన్, నికోబార్ దీవుల్లో తాను చేపట్టిన పర్యటనను గుర్తు చేసుకుంటూ.. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ద్వీపం, చారిత్రక సెల్యులార్ జైల్ తనను ఎంతగానో కదిలించాయని ఉపరాష్ట్రపతి చెప్పారు. 1943లో నేతాజీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన సందర్భాన్నీ, సెల్యులార్ జైల్లో బందీలుగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలనూ గుర్తు చేసుకున్నారు. వారిలో చాలామంది వందేమాతరం అని నినదిస్తూ ఉరికంభం ఎక్కారు.

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో దేశవ్యాప్తంగా జాతీయ గేయం వందేమాతరం చూపిన ప్రభావం గురించి శ్రీ సీపీ రాధాకృష్ణన్ వివరించారు. వందేమాతరం స్ఫూర్తినీ, సందేశాన్నీ ప్రజలకు చేరవేసేలా స్వాతంత్ర్య సమరయోధులూ, తమిళనాడుకు చెందిన నాయకులూ చేసిన కృషినీ, త్యాగాలనూ స్మరించుకున్నారు. వారిలో వీవో చిదంబరం పిళ్లై, సుబ్రమణ్య శివ, తిరుప్పూర్ కుమరన్, వంచినాథన్, జాతీయ కవి సుబ్రమణ్య భారతి ఉన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2022లో ప్రారంభించిన 'హర్ ఘర్ తిరంగా అభియాన్' ప్రజాఉద్యమంగా మారిందనీ, దీనిలో తిరంగా యాత్రలు, బైక్, సైకిల్ ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యకలాపాల్లో ప్రజలు పాల్గొంటున్నారనీ ఉపరాష్ట్రపతి చెప్పారు. ఒకటే మాతృభూమి అనే భావనకు తిరంగా దృశ్యరూపం ఇస్తుందనీ, ఎంపీలు, ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, జాతీయ పతాకాన్ని గర్వంగా ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించాలనీ ఆయన కోరారు.

కేంద్ర మంత్రులు శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్, శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, శ్రీ వీరేంద్ర కుమార్, శ్రీ జీ కిషన్ రెడ్డి, శ్రీ కిరణ్ రిజిజు, శ్రీ జితేంద్ర సింగ్, పార్లమెంట్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి గుండెల్లో దేశభక్తి నింపడమే 'హర్ ఘర్ తిరంగా' ఉద్దేశం..

## -పాల్గొన్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సముద్రాల హంసరాణి కృష్ణ గౌడ్..



మేడ్చల్, ఆగష్టు 13: భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 299 గుండ్లపోచంపల్లి డివిజన్‌లో గురువారం రోజు తిరంగా ర్యాలీని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ సముద్రాల హంసరాణి కృష్ణ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, చేతిలో జాతీయ జెండా పట్టుకుని ర్యాలీని ముందుండి నడిపించారు. ఈ సందర్భంగా హంసరాణి మాట్లాడుతూ.. తిరంగా కేవలం మూడు రంగుల జెండా మాత్రమే కాదని, అది భారత సమగ్రతకు, ఐక్యతకు స్వాతంత్ర్య సమరయోధుల అమూల్య త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ పిలుపుతో దేశంలో జాతీయ భావం మరిన్ని రెట్లు పెరిగిందని అన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయ భేదాలను పక్కనబెట్టి ప్రతి ఒక్కరూ జాతీయ జెండా నీడన ఒక్కటికావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్య సాధన కోసం ప్రతి పౌరుడు పునరంకితం కావాలని కోరారు. త్రివర్ణ పతాకాలతో, "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో డివిజన్ పురవీధులన్నీ దేశభక్తితో హోరెత్తాయి. ఈ ర్యాలీలో త్రివేణి ఇంద్ర స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు బీజేపీ నాయకులు సముద్రాల కృష్ణ గౌడ్, అర్జున్ బాబు, బూత్ అధ్యక్షులు మల్లేష్, ప్రభాకర్, బిజెపి కార్యదర్శులు కె. సత్యనారాయణ, బాలకృష్ణ, శ్రీనివాస్, రాకేష్, మల్లేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, వై. గిరి, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మాజీ రాష్ట్రపతి శ్రీ రాంనాథ్ కోవింద్ ఆత్మకథను ఆవిష్కరించిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 13:'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పేరుతో భారత మాజీ రాష్ట్రపతి శ్రీ రాంనాథ్ కోవింద్ రచించిన ఆత్మకథను న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఆవిష్కరించారు. సభనుద్దేశించి ప్రసంగిస్తూ.. "శ్రీ రాంనాథ్ కోవింద్ ఆత్మకథను ఆవిష్కరించుకునే అవకాశం ఈ రోజు మనకు లభించింది. ఈ కార్యక్రమంలో భాగస్వామిని కావడం నాకెంతో సంతోషాన్నిస్తోంది" అని ప్రధానమంత్రి శ్రీ మోదీ పేర్కొన్నారు.

రాంనాథ్ కోవింద్‌తో ప్రగాఢమైన తన వ్యక్తిగత అనుబంధాన్ని శ్రీ మోదీ గుర్తుచేసుకున్నారు. ఇన్నేళ్లుగా ఆయన మార్గనిర్దేశం, ఆప్యాయతల పట్ల అపారమైన గౌరవాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు. "శ్రీ కోవింద్‌తో నాకు సుదీర్ఘ పరిచయముంది. ఆయనను దగ్గరగా చూసే అదృష్టం కలిగింది. రాష్ట్రపతి హోదాలో వారి మార్గనిర్దేశం మరువలేనిది. అన్నిటికన్నా ముఖ్యంగా.. నా పట్ల వారికున్న ప్రత్యేకమైన ఆప్యాయతానురాగాలే నాకు గొప్ప సంపద" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

కోవింద్ వ్యక్తిత్వ ఔన్నత్యాన్నీ, సమర్థతనూ శ్రీ మోదీ ప్రశంసించారు. ఆయన రచన దేశ ప్రజాస్వామ్య విలువలకు శాశ్వత నిదర్శనంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. "శ్రీ రాంనాథ్ కోవింద్ ఆత్మకథ దేశ ప్రజాస్వామ్యానికీ, భారతీయ సమాజానికీ గొప్ప వారసత్వ సంపదగా నిలుస్తుందని పూర్తి నమ్మకంతో చెప్పగలను" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

శ్రీ కోవింద్ దేశానికి అందించిన అపారమైన సేవలను ప్రధాన మంత్రి ప్రస్తావించారు. పుస్తకం లోని వివరాలను ఎక్కువగా వెల్లడించకుండా.. పాఠకులే స్వయంగా చదివి ఆ విశేషాలను తెలుసు కోవాల్సిందిగా ప్రోత్సహించారు. "పుస్తకావిష్కరణ సమయంలో గ్రంథ పరిచయం మాత్రమే ఉండాలి. మీరంతా ఈ పుస్తకాన్ని మొత్తం చదివితేనే పూర్తి ప్రయోజనం లభిస్తుంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

యువతరానికి ఎన్నో విద్యాపరమైన మార్గదర్శక విలువలను కూడా ఈ ఆత్మకథ అందిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి మాటల నుంచి భావి తరాలు ప్రేరణ పొందాలని ఆకాంక్షించారు. "దేశ నవతరం కూడా ఆయన రచనలనూ, అనుభవాలనూ చదవాలి. వీటి నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

పుస్తకం పేరు 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్'ను విశ్లేషించారు. వ్యక్తిగత కష్టాలను అధిగమించడంతోపాటు, దేశ ప్రజాస్వామ్య విజయమనే రెండు ముఖ్యమైన అంశాలు అందులో భాగంగా ఉన్నాయని ప్రధానమంత్రి వివరించారు. "జీవిత పోరాటాలు ఆయన వ్యక్తిగతం. అయితే, ఆ పోరాటాల ద్వారా సాధించిన విజయం భారత్‌దీ, దేశ ప్రజాస్వామ్యానిదీ" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

శ్రీ రాంనాథ్ కోవింద్ ఉదారమైన ఆలోచనలు సగటు మనిషి సహజ ధోరణికి భిన్నమైనవన్నారు. చాలామంది తమ కష్టాలకు సమాజాన్ని నిందిస్తుంటారనీ, కానీ భారతీయ విలువల్లో బలంగా వేళ్లూనుకున్న శ్రీ కోవింద్ హృదయం మాత్రం.. తన విజయంలో సమాజాన్ని కూడా భాగస్వామిగా భావిస్తుందనీ ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. "హృదయంలో ఔదార్యం, భారతీయ విలువలు ఉంటే.. ఆ మనిషి సమాజంలో తప్పులు వెతుకుతూ సమయాన్ని వృథా చేయడు. సమాజంలోని సానుకూల అంశాలపైనే దృష్టి సారిస్తాడు" అని శ్రీ మోదీ చెప్పారు.

ఈ ఆత్మకథలో పేర్కొన్న ఒక విషాదకరమైన చిన్ననాటి ఘట్టాన్ని ప్రధానమంత్రి గుర్తు చేశారు. కాన్పూర్ దేహాత్‌లోని ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు.. నిత్యావసర వస్తువులను బయటకు తెచ్చే ప్రయత్నంలో.. శ్రీ రాంనాథ్ కోవింద్ తల్లి ప్రాణాలు కోల్పోయిన ఉదంతాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. "చిన్నతనంలోనే ఇలాంటి ప్రమాదం జరగడం, అలా తల్లిని కోల్పోవడం ఎంతటి వేదనను మిగిల్చి ఉంటుందో మీరు ఊహించవచ్చు" అని శ్రీ మోదీ అన్నారు.

ఈ విషాదానంతరం తిరిగి గుండెనిబ్బరాన్ని కూడగట్టుకున్న తీరును ప్రధానమంత్రి వివరించారు. పొరుగున ఉన్న ఒక తల్లి శ్రీ కోవింద్ పెంపకంలో ఎలా తోడ్పడిందో, ఆ సంఘటన సామాజిక సామరస్యంపై ఆయన అవగాహనను ఏ విధంగా లోతుగా ప్రభావితం చేసిందో శ్రీ మోదీ వివరించారు. "దీన్నుంచే సమాజ ఐక్యత, సమరసతా శక్తిని ఆయన అర్థం చేసుకున్నారు. ఆ కష్టాలు శ్రీ రాంనాథ్ కోవింద్‌ను మరింత దృఢంగా మార్చాయి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఆ విషాదం తర్వాత శ్రీ కోవింద్ తండ్రి వ్యవహరించిన స్ఫూర్తిమంతమైన తీరును ప్రధానమంత్రి వివరించారు. ఆయన కుటుంబాన్ని నడిపించిన విధానం, పిల్లల్లో బలమైన విలువలను నూరిపోసిన విధానాన్ని గుర్తుచేశారు. "ఆయన కుటుంబాన్ని నడిపించిన తీరు, పిల్లలకు విలువలను నేర్పించిన విధానం వల్లే.. శ్రీ కోవింద్ తన తండ్రిని హీరోగా భావిస్తారు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

పేదరికాన్ని అధిగమించడానికి శ్రీ కోవింద్ విద్యనే ఆసరాగా చేసుకున్నారని ప్రధానమంత్రి అన్నారు. దేశ అత్యున్నత పదవిని చేపట్టేలా ఎదిగిన ఆయన అసాధారణ ప్రస్థానాన్ని వివరించారు. "ఆయన కష్టపడ్డారు. పేదరికాన్ని బలహీనతగా మారనివ్వలేదు. ఆ రోజుల్లో ప్రజలు కనీసం ఊహించను కూడా లేని అత్యున్నత స్థానానికి ఎదిగారు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

మాజీ రాష్ట్రపతి నిరాడంబరతను, వినయాన్ని ప్రధానమంత్రి కొనియాడారు. శ్రీ కోవింద్ తన స్వగ్రామం పరోంఖ్‌కు వచ్చినప్పుడు.. అక్కడి నేలకు నమస్కరించి, తన పూర్వ ఉపాధ్యాయుల పాదాలను తాకిన భావోద్వేగభరితమైన ఘట్టాన్ని గుర్తుచేశారు. "ఆయన నడవడి.. భారతీయ విలువలను ప్రపంచం ముందు నిలిపింది. ప్రతి భారతీయుడికీ అది గర్వకారణం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

శతాబ్దాల పరాధీనత వల్ల ఎదురైన సామాజిక – ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రస్తావిస్తూ... మహాత్మాగాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిబాపూలే వంటి చరిత్రాత్మక మహనీయుల నిరంతర పోరాటాలనూ, దూరదృష్టి కలిగిన వారి స్వప్నాలనూ ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. "అత్యంత నిరుపేద కూడా అత్యున్నత స్థానానికి చేరుకునే అవకాశం లభించేలా.. నవభారత పునర్నిర్మాణం జరగాలని అలాంటి మహనీయులెందరో కలలుగన్నారు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఈ చారిత్రక ఆకాంక్షలనూ, ఆధునిక విజయాలనూ ముడిపెడుతూ... కఠోర శ్రమ ద్వారా సమసమాజ స్థాపన అనే శతాబ్దాల నాటి నినాదాన్ని సాకారం చేయడంలో కోవింద్ వంటి ఎందరో ప్రముఖులు కీలక పాత్ర పోషించారంటూ శ్రీ మోదీ ప్రశంసించారు. "శ్రీ కోవింద్ వంటి వ్యక్తులు కష్టపడే తత్వంతో, సామర్థ్యంతో జీవితాలను తీర్చిదిద్దుకోవడం మాత్రమే కాదు.. శతాబ్దాల నాటి ఆ కలను సాకారం చేయడంలోనూ కీలక పాత్ర పోషించారు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి నిబద్ధత కలిగిన యువత ఎల్లప్పుడూ అత్యావశ్యకమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఆటంకాలకు జంకకుండా, దేశ ఆత్మనిర్భరత దిశగా మార్గం సుగమం చేసేలా ధైర్యంగా ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. "ఈ మార్పుతోనే సాధికారిక భారత్‌ను నిర్మించాలన్న సంకల్పం సాకారమవుతుంది.

ఆత్మనిర్భర, వికసిత భారత్ నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

అత్యంత ప్రేరణదాయకమైనదిగా ఈ ఆత్మకథను పేర్కొంటూ... అత్యావశ్యకమైన ఇలాంటి యువశక్తిని తీర్చిదిద్దేందుకు శ్రీ కోవింద్ జీవిత విశేషాలు కచ్చితమైన మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయని ప్రధానమంత్రి అన్నారు.

''అలాంటి యువశక్తి నిర్మాణం కోసం కావాల్సిన ప్రేరణను శ్రీ కోవింద్ ఆత్మకథ అందిస్తుంది'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

శ్రీ కోవింద్ రాజకీయ జీవిత ప్రారంభాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. అంతర్గతంగా దేశసేవా భావన ఉన్న ఆయన పూర్తిస్థాయి రాజకీయాల దిశగా పయనం సాగించేందుకు.. మొరార్జీ దేశాయ్ సాహచర్యం ఏ విధంగా దోహదం చేసిందీ శ్రీ మోదీ వివరించారు. "ఆయనలో అంతర్గతంగా ఉన్న దేశసేవా తత్పరతకు.. మొరార్జీతో కలిసి పనిచేయడం ద్వారా ఒక సరైన మార్గం లభించింది' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఆయన సుదీర్ఘ సేవా ప్రస్థానాన్ని ప్రధానమంత్రి కొనియాడారు. పార్లమెంటులో వివిధ పాత్రల్లో, గవర్నరుగా, ఆపై రాష్ట్రపతిగా వివిధ హోదాల్లో శ్రీ కోవింద్ కనబరిచిన అచంచలమైన కర్తవ్యనిష్ఠను ప్రధానమంత్రి ప్రశంసించారు. "సేవే లక్ష్యంగా ఆయన పనిచేశారు. పార్లమెంటులో ఆయన బాధ్యతల నిర్వహణ తీరు దీనిని స్పష్టం చేస్తోంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

రాష్ట్రపతిగా పదవీకాలం ముగిసిన తర్వాత కూడా శ్రీ కోవింద్ అవిశ్రాంత కృషిని ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకురాగల.. 'ఒక దేశం, ఒకే ఎన్నిక' వంటి కీలకమైన జాతీయ అంశాల్లో ఆయన నేతృత్వం వహిస్తుండడాన్ని ప్రశంసించారు. "శ్రీ కోవింద్ కర్తవ్య దీక్ష, సేవాభావాల నుంచి దేశ ప్రజలు ఎంతగానో నేర్చుకోగలరన్న దృఢమైన విశ్వాసం నాకుంది" అని శ్రీ మోదీ అన్నారు.

ప్రజాజీవితంలో అత్యంత క్రియాశీలంగా ఉంటూ కూడా ఆత్మకథను రాయడం అత్యంత కష్టతరమైన విషయమని శ్రీ మోదీ అన్నారు. సమాజానికి ఎంతో కీలకమైన ఈ రచనను పూర్తి చేసినందుకు శ్రీ కోవింద్‌కు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు. "శ్రీ కోవింద్ మనందరి కోసం ఈ రచన చేశారు. పేద, అట్టడుగు వర్గాల ప్రజల జీవితానికి అది అద్దం పడుతుంది. వారంతా తమ జీవిత ఛాయలను అందులో చూసుకోవచ్చు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఈ రచనలోని విస్తృతమైన నైతిక పాఠాలను వివరిస్తూ.. అత్యంత కఠినమైన సమయాల్లోనూ పవిత్రతకూ, నిజాయితీకీ కట్టుబడి ఉండడం ద్వారా లభించే అత్యున్నత శక్తిని మాజీ రాష్ట్రపతి జీవిత చరిత్ర చాటుతోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. "వివిధ పదవుల్లో బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. దేశసేవకు అవసరమైన శక్తిని ఈ పవిత్రత మనకు ఎంతలా అందిస్తుందనే విషయంలో శ్రీ కోవింద్ సమాజానికి నిరంతర స్ఫూర్తిగా నిలిచారు" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

# మహబూబాబాద్ జిల్లాలో రైలు ఢీకొని టీచర్ మృతి

ములుగు, ఆగష్టు 13:(నేటినిజం ప్రతినిధి)మహబూబాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పుష్‌పుల్ రైలు ఢీకొని ఉపాధ్యాయుడు దుర్మరణంచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న ఎండీ గౌస్‌మియా మహబూబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గౌస్‌మియా మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

# కస్తూర్బా విద్యాలయం తనిఖీ



కామారెడ్డి, ఆగష్టు 13:(నేటినిజం ప్రతినిధి) మండల కేంద్రం శివారులో ఉన్న కస్తూర్బా విద్యాలయాన్ని నిజామాబాద్ ఇన్‌చార్జి కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, కిచెన్, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన ఇన్‌చార్జి కలెక్టర్ వెంటనే శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, సువిశాలమైన ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నందున వసతులతో కూడిన క్రీడ మైదానంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, మెనూ వివరాలు అడిగి తెలుసు కున్నారు. పాఠశాల ఆవరణలో వరి, కూరగాయలు సాగు చేస్తుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దత్తాద్రి, ఎంపీ డీవో శంకర్ నాయక్, ఎంఈవో గాలప్ప, ఎంపీవో మన్మోహన్, ఎస్‌వో దీపిక, బాలికల గురుకుల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేఖ, సర్పంచ్ కందగట్ల రాంచందర్ ఉన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో సామాజిక చైతన్య నాటకోత్సవాలు..

## మహనీయుల ఆశయాలపై 14 నుంచి 16 వరకు నాటక ప్రదర్శనలు..

వరంగల్, ఆగష్టు 13: సామాజిక చైతన్యం, సమానత్వం, మానవతా విలువలు, మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో సింగరేణి ఆధ్వర్యంలో మూడు రోజుల సామాజిక చైతన్య నాటకోత్సవాలను నిర్వహించనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆగస్టు 14 నుంచి 16 వరకు ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు భూపాలపల్లి కృష్ణకాలనీలోని సీఈఆర్ క్లబ్ మినీ ఫంక్షన్ హాల్‌లో ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయాలపై 'శరణం శరణం గచ్ఛామి', 15న జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల సామాజిక పోరాటంపై 'సత్యశోధన', 16న అంబేద్కర్ ఆలోచనా ప్రస్థానం, బౌద్ధ తత్వం వైపు ఆయన ప్రయాణాన్ని ప్రతిబింబించే 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మహనీయుల జీవితాలు, సామాజిక ఉద్యమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, మానవతా విలువలపై చైతన్యం కల్పించడమే కార్యక్రమాల ఉద్దేశమన్నారు. కార్మికులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నాటకోత్సవాలను విజయవంతం చేయాలని జీఎం కోరారు.

# ప్రాజెక్టుల అనుమతుల రద్దు కుట్రను అడ్డుకోవాలి..

## -మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, ఆగష్టు 13: తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీ ఎం ఆర్ బీ ) సమావేశం ఎజెండా నుంచి వెంటనే తొలగించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న జీ ఎం ఆర్ బీ 18వ సమావేశం నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించడం, ఆ అంశాన్ని జీ ఎం ఆర్ బీ సమావేశం ఎజెండాలో చేర్చడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని వినోద్‌కుమార్ అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు సాధించిన చట్టబద్ధమైన అనుమతులను రద్దు చేయాలనే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దయితే తెలంగాణ రైతాంగం, సాగునీటి రంగం, రాష్ట్ర భవిష్యత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఈ అంశంపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ఎంపీలందరూ వెంటనే ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి, ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని జీ ఎం ఆర్ బీ ఎజెండా నుంచి తొలగించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని వినోద్‌కుమార్ కోరారు. పార్లమెంట్ వేదికగా కూడా తెలంగాణ ప్రయోజనాల కోసం గట్టిగా పోరాడాలని సూచించారు. జీ ఎం ఆర్ బీ సమావేశాన్ని బీఆర్ఎస్ బహిష్కరించాలని కోరుతోందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వినోద్‌కుమార్ విమర్శించారు. సమావేశాన్ని బహిష్కరించాలన్నది తమ పార్టీ డిమాండ్ కాదని, తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని మాత్రమే ఎజెండా నుంచి తొలగించాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాన్ని పక్కదారి పట్టించకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాంచందర్ రావును కోరారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దయితే రాష్ట్రంలో తీవ్ర విపత్కర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నెల 18వ తేదీలోగా తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల పునఃపరిశీలన, రద్దుకు సంబంధించిన ప్రతిపాదనలను ఉపసంహరించుకోవడంతో పాటు, రద్దు అంశాన్ని జీ ఎం ఆర్ బీ సమావేశం ఎజెండా నుంచి తక్షణమే తొలగించాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు.

# దేశభక్తి ప్రపూర్ణుడు మాగంటి బాపినీడు

## ఆగస్టు 14...మాగంటి బాపినీడు జయంతి

మాగంటి బాపినీడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న దక్షిణ భారతానికి చెందిన అగ్రశ్రేణి నాయకులు. తెలుగులో విజ్ఞాన సర్వస్వాన్ని "ఆంధ్ర సర్వస్వము" అన్న పేరుతో ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రచురించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పోరాడిన తొలితరం నాయకులలో ఒకడు. ఆయన సహధర్మ చారిణి మాగంటి అన్నపూర్ణాదేవి కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నది. ఆమె మంచి రచయిత్రి, సమాజ సేవిక. బాపినీడు 1895లో ఆగస్టు 14న చాటపర్రు గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. కె. వెంకటరత్నం రెడ్డి వంటి సంఘసంస్కర్తల ప్రభావం, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటి రాజకీయ నాయకుల ప్రభావం అతనిపై బలంగా పడింది. ముందు చూపు కలిగిన ఆయన కుటుంబం కలకత్తాలో ఆయన విద్యాభ్యాసానికి ఏర్పాటు చేసింది. అక్కడ అనేక రచయితల పరిచయం లభించింది. తరచు శాంతినికేతన్ సందర్శించేవారు. తరువాత ఆయన "ఇండియన్ డిఫెన్సు కార్ప్స్"లో చేరారు. అలాంటి మిలిటరీ శిక్షణ పొందిన మొదటి ఆంధ్రుడు మాగంటే. కలకత్తాలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేవారు. బెంగాల్ ఆంధ్రా అసోసియేషన్కు కార్యదర్శిగా పని చేశారు. తరువాత 1920 లో, కలకత్తాలోని సిటీ కాలేజీలో చదువుతున్న సమయంలో, అన్నపూర్ణాదేవిని మాగంటి బాపినీడు వివాహం చేసుకున్నారు. ఆంధ్రదేశంలో సాంఘిక సంస్కరణల చరిత్రలో ఈ వివాహం ఒక చిరస్మరణీయ సంఘటన వివాహం అయిన వెంటనే, బాపినీడు సత్యలింగం ఛారిటీస్ స్కాలర్షిప్ పొందారు, స్వరాజ్ కోసం గొప్ప పోరాటంలో తన భార్యను విడిచిపెట్టి అమెరికాను విడిచి పెట్టారు.

ప్రతిభా విద్యార్థిగా ఆయన అమెరికాలో ఉన్నత చదువులకు వెళ్ళారు. అక్కడ "న్యూయార్క్ స్టేట్ కాలేజి ఆఫ్ అగ్రికల్చర్"లో బి.ఎస్.సి చదివారు. కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో ఎమ్.ఎస్.సి పూర్తి చేశాడు. ప్రొఫెసర్ వెబర్ అనే పండ్ల నిపుణుని వద్ద పని చేశారు. కార్నెల్ విశ్వ విద్యాలయం స్కాలర్షిప్పు లభించింది. కార్నెల్ విశ్వ విద్యాలయం అంతర్జాతీయ వ్యవసాయక సంఘం ఆయన స్థాపకుడు, మొదటి ప్రెసిడెంట్ కూడా. కాలిఫోర్నియాలో హిందూస్తాన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా పనిచేశారు. తరువాత బాపినీడు భారత దేశం తిరిగి వస్తూ మధ్యలో జపాన్ దేశాన్ని సందర్శించారు. 1923లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కిసాన్ ఉద్యమం ప్రాంభించారు. "ఆంధ్ర రైతు సభ" మొట్టమొదటి కార్యదర్శిగా పని చేశారు. గోదావరి - కృష్ణా సెటిల్మెంట్ సెంట్రల్ కమిటీలో చురుకుగా పని



చేశారు. కిసాన్ ఉద్యమాలు నడిపినందుకు ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించారు. మహాత్ముని మన్నలను పొందిన దేశభక్తురాలు మాగంటి భార్య అన్నపూర్ణ 1926లో మరణం ఆయనకు కోలుకొని పెద్ద దెబ్బ. ఆమె ఆయన దీక్షా కార్యక్రమాలలో చేదోడుగా ఉన్న ప్రతిభాశాలిని. బాపినీడు ఆంధ్ర విశ్వవిద్యాలయం సిండికేట్ మెంబరుగాను, ఆంధ్ర హరిజన సేవక సంఘం కార్యదర్శిగాను కూడా పని చేశారు. 1933 డిసెంబర్ లో గాంధీజీ పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా హరిజన సేవక సంఘ అధ్యక్షునిగా కలిదిండి గంగరాజు, కార్యదర్శిగా చంగల్వల చిట్టిపంతులు, ఆంధ్రరాష్ట్ర హరిజన సేవక సంఘ ప్రధాన కార్యదర్శిగా, మాగంటి బాపినీడు బాధ్యతలు నిర్వహించారు. 1937లో మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యాడు. పబ్లిక్ ఇన్ఫర్మేషన్ పార్లమెంటరీ సెక్రటరీగా పని చేశారు.

మొత్తము గాంధీజీ ఆంధ్ర దేశంలో సంచరించిన దినములు 11 రోజులు మాత్రమే. ఈ కాలంలో గాంధీజీ 10 జిల్లాలు సంచారము చేశారు. 1,024 మైళ్ళ రైలుపైన, 667 మైళ్ళ మోటారు వాహనముల పైన, 15 మైళ్ళ స్టీము లాంచి పైన, 2 మైళ్ళ కాలినడకను మొత్తం 1708 మైళ్ళ సంచారము చేశారు. 76 గ్రామములు, పట్టణములను సందర్శించి, 60 సభలలో ఉపన్యాసములు ఇచ్చారు. వేలాది మంది ఉపన్యాసములు వినుటకు అవకాశము కలగగా, లెక్కకు మించి మహాత్ముని దర్శించు భాగ్యము దక్కింది. ఈ పర్యటనలో మాగంటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గాంధీజీ దక్షిణ భారత హిందీ ప్రచారసభకు అధ్యక్షత వహించేందుకై మదరాసు వెళుతూ 1946, జనవరి 26వ తేదీన రాత్రి 8గంలకు గాంధీజీ బయలు దేరిన ప్రత్యేక రైలు ఏలూరు స్టేషనునందు ఆగిన సందర్భంలో జిల్లా కాంగ్రెసు అధ్యక్ష కార్యదర్శులు మాగంటి బాపినీడు, సత్తిరాజు రామమూర్తి, డా. మూల్పూరి రంగయ్య, చుక్కమ్మతో పాటు కాంగ్రెసు కార్యకర్తలు అనేకమంది గాంధీజీకి స్వాగతం చెప్పారు. విపరీతమైన జన సందోహం రావటంతో రైల్వేప్లాట్ ఫారం నిండిపోగా, ప్లాట్ ఫారం వెలుపల వేలకొద్దీ జనం నిలబడ వలసి వచ్చింది. ఏర్పడింది. గాంధీజీ 15 నిమిషములు విరాళములను స్వీకరించారు. చాల మంది స్త్రీలు బంగారు గాజులు, ఉంగరాలు, ముక్కెరలు, ఆభరణాలను సమర్పించారు. ఒక మహిళ ఎనిమిది నవరసుల తూకంగల బంగారు గొలుసును సమర్పించింది. మొత్తం రూ.2,500/- నగదు, రూ.2,500/- విలువైన నగలు వసూలైనాయి. దక్షిణాదిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులలో ముఖ్యునిగా గుర్తింపు పొందిన బాపినీడు సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళాడు. ఎ.ఐ.సి.సి. మెంబరుగా కూడా సమర్థ వంతంగా పని చేశారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## తిరంగా యాత్రతో దేశభక్తి చాటిన బీజేపీ



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 13:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కొడిముంజ, శభాష్‌పల్లి, చింతలఠాణ గ్రామాల మీదుగా నంది కమాన్ చౌరస్తా వరకు కొనసాగింది.ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు జాతీయ జెండా ప్రాధాన్యాన్ని చాటిచెప్పే ఉద్దేశంతో తిరంగా యాత్ర చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల రాజవ్వ, మండల ఉపాధ్యక్షులు ఎరుగొక్కుల రమేష్, తిప్పరవేణి రాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గోనె భాస్కర్, ఆరేపల్లి ఉపసర్పంచ్ సిల్వేని ప్రశాంత్, మండల కార్యదర్శులు సంజీవ్ రెడ్డి, బూర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల యువ సమ్మేళనం...



కరీంనగర్, 13 (నేటినిజం ప్రతినిధి) ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కొత్తపల్లిలోని సాయిరాం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన యువసమ్మేళనం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, ప్రధాన వక్తలుగా హాజరైన ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భాను చందర్ జి , తడగొప్పుల శంకరయ్య జి లు మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువతే బలమైన పునాదన్నారు. యువత క్రమశిక్షణ, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు యువతకు ఉందని, ఇటీవల జెన్-జీ చెపట్టిన ఆందోళనలు దేశ వ్యతిరేకం కాదని, ఆ ముసుగులో దేశ వ్యతిరేక శక్తులు చొరబడి అలజడులు సృష్టించి దేశాన్ని దెబ్బ తీసే ప్రయత్నం జరిగిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఆందోళనలు, నిరసనలు సంభాషణకు ఒక మార్గమని, అయితే అవి ప్రజాస్వామ్య నిబంధనల పరిధిలోనే జరగాలని కానీ, దేశ వ్యతిరేక శక్తులు ఇలాంటి విషయాల్లో తల దూర్చితే అనేక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని , అందుకే యువత జాగ్రత్తతో వ్యవహరించాలని వక్తలు సూచించారు. ముఖ్యంగా దేశాభివృద్ధిలో, సామాజిక మార్పులో యువత క్రమశిక్షణ, దేశభక్తితో ముందుండి దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని వారు ఆకాంక్షించారు. యువత దేశం పట్ల అంకితభావం, మన సంస్కృతి, సంప్రదాయాలు,చారిత్రక గొప్పతనంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేవలం విద్యనే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, కష్టకాలంలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే నాయకత్వ గుణాలను పెంపొందించుకోవాలని సూచించారు.కుల, మత, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి సమాజమంతా ఒక్కటే అనే భావన ను యువత కలిగి ఉండాలన్నారు.యోగా, వ్యాయామాలు, బౌద్ధిక చర్చలు ను యువత నిత్యజీవితంలో అలవాటుగా మార్చుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ (మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ), రక్తదాన శిబిరాలు సామాజిక సేవా కార్యక్రమాలలో యువత క్రియాశీలకంగా ఉండాలన్నారు.. ప్రధానంగా ఈ సమ్మేళనాలు యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి, దేశ నిర్మాణాత్మక కార్యక్రమాలలో భాగస్వామ్యులుగా చేయాలనే సంకల్పంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రోగ్రాం లో ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్ , సహకార్యవాహ మురళి , రమణ, కన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఏషియన్ పెయింట్స్ 'బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' క్యాంపెయిన్

హైదరాబాద్, ఆగస్టు 13: ఇంటికి రంగులు వేయడం చాలా ఒత్తిడితో కూడుకున్న పని. ఎందుకంటే, కాంట్రాక్టర్ ను సమన్వయం చేసుకోవడం, సరైన రంగులను ఎంచుకోవడం, సమయపాలన పాటించడం, పరిశుభ్రత, వాటర్‌ప్రూఫింగ్ సమస్యలను పరిష్కరించుకోవడం వీటితో పాటు నాణ్యత తదితర అంశాలు ఇమిడి ఉంటాయి. ఈ ప్రధాన అంశాలను గుర్తించిన ఏషియన్ పెయింట్స్ 'ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హోమ్స్ పెయింటింగ్ సర్వీస్' క్యాంపెయిన్ ను దక్షిణాది వినియోగదారుల కోసం ప్రారంభించింది. సైట్ ఇన్‌స్పెక్షన్, ప్రత్యేక సూపర్‌విజన్, ఏఐ విజువలైజర్ ద్వారా వ్యక్తిగత కలర్ కన్సల్టేషన్, ఇరవై శాతం మనీ బ్యాక్ గ్యారెంటీ, ప్రొడక్ట్ స్కాన్ ఆధారిత వారంటీ, సరైన సమయానికి పని పూర్తి చేయడం వంటి ప్రత్యేకతలతో ఈ సేవ వినియోగదారులకు అందుబాటులోకి వస్తుంది. ఈ క్యాంపెయిన్‌లో దక్షిణ భారతదేశ సంస్కృతి, గృహ యజమానుల రోజువారీ అనుభవాల ఆధారంగా రూపొందించిన వరుస ప్రకటన చిత్రాలు ఉన్నాయి. 'ఆనందకరమైన ఆశ్చర్యం' అనే అంశం నేపథ్యంగా సాగే ఈ చిత్రాలలో ఒక పెయింటింగ్ ప్రాజెక్ట్ ఇంత సులభంగా, అవాంతరాలు లేకుండా ఎలా పూర్తవుతుందో నమ్మలేకపోయే ఒక అనుమానాస్పద తండ్రి కనిపిస్తారు.




## నగరపాలక సంస్థ 23వ డివిజన్ సీతారాంపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కరీంనగర్, 13 (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 23వ డివిజన్ సీతారాంపూర్ ప్రాంతంలో సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సదుపాయాలు, తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సీతారాంపూర్ ప్రాంతంలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగి, మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.అనంతరం 17, 18 డివిజన్లకు సంబంధించిన అమృత్ 2.0 నిధులతో చేపట్టనున్న బ్లాక్ ప్లాంటేషన్ ఫెన్సింగ్ పనులను మేయర్ గారు ప్రారంభించారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా చేపట్టుతున్న ఈ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉంటాయని ఆయన అన్నారు. మొక్కల సంరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా వాటి పెరుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి రాజకుమార్ , 17, 18వ డివిజన్ కార్పొరేటర్లు వేముల కవిత చంద్రశేఖర్ , వాసాల రమేష్ , మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




కరీంనగర్, 13 (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ బీజేపీ నార్త్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. దేశభక్తి భావాన్ని ప్రజల్లో మరింత బలోపేతం చేయడం, ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించబడింది.ఈ ర్యాలీ ఎస్ఆర్ఆర్ కళాశాల నుండి ప్రారంభమై కోర్టు సర్కిల్‌లోని అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొని జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలతో ముందుకు సాగారు.ర్యాలీ అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఉన్న వారందరూ కలిసి జాతీయ గీతం ఆలపించి దేశానికి తమ గౌరవాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశ ఐక్యత, సమగ్రత, దేశభక్తి భావనకు ప్రతీక అని అన్నారు. ప్రతి పౌరుడు జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు గారు , జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ బండ రమణారెడ్డి, బీజేపీ నార్త్ జోన్ అధ్యక్షులు పాదం శివరాజ్, నాయకులు భారీ జితేందర్,చిగిరి రవీందర్, మాడిశెట్టి సంతోష్, బోయిని శ్రీనివాస్, కైలాస నవీన్, గాండ్ల నరేష్ ,నక్క ప్రమోద్, వెంకటేష్, వినయ్ ,నికిల్,మహేష్, నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, యువమోర్చా నాయకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వేములవాడ లో బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 13:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్ కుమ్మరి శంకర్, సీనియర్ నాయకులు ఎర్రం మహేష్, బిజెపి పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ పాల్గొన్నారు. కోరుట్ల బస్టాండ్ నుండి ప్రధాన వీధుల గుండా నిర్వహించిన జాతీయ జెండా ర్యాలీలో విద్యార్థులు, యువత, బిజెపి నాయకులు చేతుల్లో జాతీయ పతాకాలను పట్టుకొని పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో సాగిన ఈ ర్యాలీ నగర ప్రజల్లో దేశభక్తి భావనను మరింత పెంపొందించేలా నిర్వహించబడింది.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశ సమైక్యత, జాతీయ గౌరవం మరియు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు రా పె ల్లి శ్రీధర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజలు విస్తృతంగా విజయవంతం చేయాలని ఆయన కోరారుబీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.